అవినీతిని, అక్రమాలను చూస్తూ ఉరుకోవడమే అతి పెద్ద పాపం..

చైతన్య వారధి

ఛారిటబుల్ ట్రస్టు(ప్రజా చైతన్యం కోసం)

RNI.No.APTEL \ 2006 \18521

# చైతన్య వారధి

తెలుగు దిన పత్రిక

website:www.cvdaily.in

CHAITANYA VARADHI TELUGU DAILY

Simultaneously Published from Visakhapatnam, Vizianagaram, Ananthapur and Guntur

చైతన్యవారధి పత్రికకు జిల్లాలో ప్రతి మండల కేంద్రం నుంచి రిపోర్టర్లు కావలెను. స్థానిక రాజకీయ, సామాజిక అంశాలపై అవగాహన ఉండి, ప్రజా సమస్యలను వార్తల రూపంలో వెలుగులోకి తేవాలన్న ఆసక్తి ఉన్న యువకులకు ప్రాధాన్యత ఇవ్వబడును. సంప్రదించండి - 9848682422

VISAKHAPATNAM | సంపుటి: 21 | సంచిక: 116 | శుక్రవారం 9-10-2026 | ఎడిటర్ : బి.గోపీనాధరావు | పేజీలు : 8 | వెల : 1.00

## ఏపీని పెట్టుబడులు, పరిశ్రమలకు అగ్రగామి గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం

**- 'బిల్డ్ ఏపీ'తో 15 శాతం వృద్ధి లక్ష్యం - సీఎం చంద్రబాబు**

దిల్లీ, చైతన్యవారధి: ఆంధ్రప్రదేశ్ ప్రగతికి ఉపయోగపడే ఏ విధానాన్నైనా తక్షణమే అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనకు దేశంలోనే అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు 'బిల్డ్ ఏపీ' నినాదంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. గురువారం దిల్లీలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు--2026 సన్నాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పెట్టుబడుల అవకాశాలు, కేంద్ర సహకారం, వివిధ రంగాల్లో చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ ప్రణాళికలను పారిశ్రామికవేత్తలకు వివరించారు. రాష్ట్రంలో 15 శాతం ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎం తెలిపారు. గత 24 నెలల్లో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులతో కూడిన 714 ప్రాజెక్టులను సాధించామని, వీటిలో రూ.16.6 లక్షల కోట్ల విలువైన 473 ప్రాజెక్టుల అమలుకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశామని వెల్లడించారు. రూ.4.7 లక్షల కోట్ల విలువైన 247 ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయని, వీటి ద్వారా 7.1 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని చెప్పారు. గూగుల్ గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను పారదర్శకంగా, వేగంగా అందించేందుకు




నవంబర్ 12న విశాఖపట్నంలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభం సందర్భంగా

ఎస్క్రో ఖాతాను ప్రారంభించనున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఆ తర్వాత పారిశ్రామికవేత్తలు ప్రోత్సాహకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని, అర్హమైన మొత్తాలను ఆన్‌లైన్‌లో రియల్ టైమ్‌లో జమ చేసే విధానం అమలు చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆగ్నేయాసియాకు గేట్‌వేగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వివరించారు. గోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర, కావేరి నదుల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో నీటి కొరతను అధిగమించవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో ఇప్పటికే 110 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటుపైనా ఆలోచిస్తున్నామని చెప్పారు. జీఎస్టీ వసూళ్లలో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సాంకేతికత వినియోగంతో రాష్ట్ర ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. విశాఖపట్నంలో అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం డిజిటల్ మౌలిక వసతులు, రహదారులు, రైల్వే రంగాల్లో పురోగమిస్తోందని చంద్రబాబు అన్నారు. కేంద్ర సహకారంతో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టును 2027 మార్చిలో ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇటీవల శంకుస్థాపన చేసిన రాయలసీమ హార్టికల్చర్ హబ్ అభివృద్ధికి భాగస్వాములు అవసరమని, తిరుపతిలో సెమీకండక్టర్ ఎకోసిస్టమ్ అభివృద్ధి కోసం 10 వేల ఎకరాల భూమిని కేటాయిస్తున్నామని చెప్పారు.

## డీబీటీతో రూ.5 లక్షల కోట్ల లీకేజీలకు అడ్డుకట్ట

**- మొబైల్ అనుసంధాన బ్యాంకు ఖాతాలకు రూ.50 లక్షల కోట్ల బదిలీ - ప్రధాని మోదీ**

దిల్లీ, చైతన్యవారధి: ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానం ద్వారా ప్రజలకు నేరుగా ప్రయోజనాలు అందిస్తూ, దళారుల చేతుల్లోకి వెళ్లాల్సిన రూ.5 లక్షల కోట్లను ఆదా చేయగలిగామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మొబైల్ ఫోన్లతో అనుసంధానమైన బ్యాంకు ఖాతాలకు ఇప్పటివరకు రూ.50 లక్షల కోట్లను బదిలీ చేసినట్లు వెల్లడించారు. గురువారం దిల్లీలో టెలికాం శాఖ, సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన 'ఇండియా మొబైల్ కాంగ్రెస్-2026'లో ఆయన ప్రసంగించారు. గతంలో ప్రభుత్వ పథకాల నిధులు లీకేజీల ద్వారా కొందరి చేతుల్లోకి వెళ్లిపోయేవని మోదీ పేర్కొన్నారు. ఇలాంటి అక్రమాలను అడ్డుకోవడమే తన సంకల్పమని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కిందనే రూ.4 లక్షల కోట్లకు పైగా రైతుల ఖాతాలకు నేరుగా బదిలీ చేశామని తెలిపారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని, ఆ వివరాలు మొబైల్ ఫోన్లకు సందేశాల రూపంలో



అందుతున్నాయని వివరించారు. ప్రజలకు అందాల్సిన సొమ్మును నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడం వల్ల అక్రమ ఆదాయ మార్గాలు మూసుకుపోయాయని ప్రధాని వ్యాఖ్యానించారు. తప్పుడు విధానాలను అరికట్టే విషయంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. తన నిర్ణయాలపై కొందరు విమర్శలు చేసినా, ప్రజాధనాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు కొనసాగిస్తానని మోదీ పేర్కొన్నారు.

## విశాఖ జిల్లాలో 47 మద్యం షాపులకు లాటరీ

**- రూ.17.65 కోట్ల ఆదాయం.. విజేతలకు ప్రొవిజినల్ లైసెన్సుల జారీ**

విశాఖపట్నం, చైతన్యవారధి: విశాఖపట్నం జిల్లాలో కొత్తగా 47 మద్యం దుకాణాల కేటాయింపునకు గురువారం జాయింట్ కలెక్టర్ విద్యాధరి లాటరీ నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ 52 దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేయగా, 47 దుకాణాలకు నాలుగు కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 202 మంది దరఖాస్తు చేసుకోగా, లాటరీ ద్వారా విజేతలను ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం 159 మద్యం దుకాణాలు ఉండగా, వీటిలో 145 ఓపెన్ కేటగిరీకి, 14 గీత కులాలకు కేటాయించారు. ఇప్పటికే 93 ఓపెన్ కేటగిరీ దుకాణాలు, 14 గీత కులాల దుకాణాలు కలిపి మొత్తం 107 దుకాణాలు రెన్యూవల్ చేసుకున్నారు. వీటి ద్వారా రెన్యూవల్ ఫీజు, తొలి విడత లైసెన్స్ ఫీజు, పర్మిట్ రూమ్ ఫీజు, ప్రాసెసింగ్ ఫీజుల రూపంలో కలిపి ప్రభుత్వానికి రూ.60.85 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. తాజాగా లాటరీ ద్వారా ఎంపికైన 47 దుకాణాల నుంచి దరఖాస్తు ఫీజుగా రూ.6.06 కోట్లు, ప్రాసెసింగ్ ఫీజుగా రూ.2.02 లక్షలు, తొలి విడత లైసెన్స్ ఫీజుగా రూ.10.42 కోట్లు, పర్మిట్ రూమ్ ఫీజుగా రూ.1.15




కోట్లు కలిపి మొత్తం సుమారు రూ.17.65 కోట్ల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. లాటరీలో ఎంపికైన వారిలో 40 మంది జీవీఎంసీ పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. భీమిలి రూరల్‌లో ఒకటి, ఆనందపురం మండలంలో నాలుగు, పద్మనాభం మండలంలో రెండు దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. ఎంపికైన అభ్యర్థులకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్. ప్రసాద్ ప్రొవిజినల్ లైసెన్సులు జారీ చేశారు. నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన దుకాణాలకు ప్రభుత్వం గడువు పొడిగించింది. ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి, 10వ తేదీన లాటరీ నిర్వహించనున్నారు.

## మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

**పురపాలక సంస్థలకు ఒకే దశలో.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై పరిశీలన**



అమరావతి, చైతన్యవారధి: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నద్ధమవుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలను ఒకే దశలో నిర్వహించాలని నిర్ణయించింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. స్థానిక ఎన్నికల సన్నద్ధతపై గురువారం విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఒకే దశలో నిర్వహిస్తే పోలీసు బందోబస్తు పరంగా ఇబ్బందులు ఎదురవుతాయని పది జిల్లాల ఎస్పీలు రెండు దశల్లో నిర్వహించాలని సూచించారు. దీనిపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఎస్ఈసీ వెల్లడించారు. పురపాలక ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని వైఎస్సార్ కడప కలెక్టర్ శ్రీధర్ సూచించారు. సుప్రీంకోర్టులో పెండింగ్ కేసులు పరిష్కారమై, ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఎస్ఈసీ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎన్నికల ఏర్పాట్లపై పురపాలక శాఖ కమిషనర్ సంపత్‌కుమార్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ వివరాలు సమర్పించారు.

## జర్నలిస్టులపై కేసులు ఎత్తివేయాలి

**- పత్రికా స్వేచ్ఛపై దాడిని ఆపాలి.. జర్నలిస్టు సంఘాల డిమాండ్ - కలెక్టరేట్ వద్ద ధర్నా.. కలెక్టర్‌కు వినతిపత్రం**

విశాఖపట్నం, చైతన్యవారధి: జర్నలిస్టులు సుంకరి సూర్యనారాయణ (సూర్యం), యు.వి. భాస్కర్, వి.వి. రమణమూర్తిలపై నమోదైన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, జిల్లాస్థాయి అటాక్స్ నివారణ కమిటీలను ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎన్ఏ) అధ్యక్షుడు పి. సత్యనారాయణ మాట్లాడుతూ ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు జర్నలిస్టులపై నమోదైన ఎఫ్ఐఆర్ నంబర్ 246/2026ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. అక్టోబర్ 4న రాత్రి సమయంలో మఫ్టీలో వచ్చిన పోలీసులు అనారోగ్యంతో ఉన్న సూర్యనారాయణను కుటుంబ సభ్యులకు కేసు వివరాలు తెలియజేయకుండానే తీసుకెళ్లారని ఆరోపించారు. అనంతరం కోర్టులో హాజరుపరిచినప్పటికీ బెయిల్ విషయంలో ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. జైలులో ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్టు ఈఎన్ఎస్ బాలు మాట్లాడుతూ విశాఖ రూరల్ మండలం ధారపాలెంలోని సర్వే నంబర్ 8/4లో ఏ.వి. బిల్డర్స్ నిర్మించిన అపార్ట్‌మెంట్ నిబంధనలకు విరుద్ధంగా ఉందంటూ స్థానిక పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయని తెలిపారు. ఈ అంశంపై ఫిర్యాదులు అందడంతో జీవీఎంసీ అధికారులు అపార్ట్‌మెంట్‌లోని రెండు అంతస్తులను తొలగించాలని బిల్డర్‌కు నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో వార్తను ప్రచురించిన 'లీడర్' పత్రిక ఎడిటర్ వి.వి. రమణమూర్తి, స్టాఫ్ రిపోర్టర్ యు.వి. భాస్కర్, 'సూర్య' పత్రిక స్టాఫ్ రిపోర్టర్






సూర్యనారాయణపై కేసు నమోదు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఫిర్యాదులో పేర్కొన్న రూ.8 లక్షల బ్లాక్‌మెయిల్ ఆరోపణలకు సంబంధించి తమకు తెలిసిన వివరాల ప్రకారం, సూర్యనారాయణ మొబైల్ సందేశాల్లో అలాంటి అంశాలకు ఆధారాలు లేవని ఈఎన్ఎస్ బాలు పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడు, మరో వ్యక్తి మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీల అంశాన్ని జర్నలిస్టుపై నమోదైన కేసుతో ముడిపెట్టారని ఆరోపించారు. వార్తలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. కేసుపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తగిన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జోగినాయుడు, సాక్షి బ్యూరో చీఫ్ రాఘవేంద్రరెడ్డి, సూర్య బ్యూరో చీఫ్ బి. శ్రీనివాసరావు, ఏపీఎఫ్‌డబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. గణేష్, కె. సురేష్, లీడర్ బ్యూరో చీఫ్ ఈ. వెంకటేష్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కేంద్ర కమిటీ సభ్యుడు మొల్లి కమల్ కుమార్, స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. అశోక్ కుమార్, సామ్నా రాష్ట్ర కార్యదర్శి కె. చక్రవర్తి, ఇంటర్నేషనల్ దళిత్ జర్నలిస్ట్ నెట్‌వర్క్ ప్రతినిధి వై. బాలకృష్ణ, ఆరిలోవ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రామరాజు, అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మళ్లా భాస్కర్‌తో పాటు పలువురు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# ఎప్పటికప్పుడు సమాధానం వెతకాలి

ప్రభుత్వ విధాన నిర్ణయాలకు తోడు ఉత్పత్తి వ్యయం గణనీయంగా తగ్గడంతో గడచిన అయిదేళ్లలో దేశంలో సుమారుగా 120 గిగావాట్ల కొత్త సౌరవిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం జతచేరింది. దీంతో మొత్తం సౌర విద్యుత్ సామర్థ్యం 162 గిగావాట్లకు చేరుకుంది. అయితే, దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోవడానికి ప్రధాన కారణం డిమాండ్ లేకపోవడం కాదు. ఉత్పత్తి కేంద్రాల నుంచి వినియోగదారుల వరకు విద్యుత్‌ను తీసుకెళ్లే పంపిణీ వ్యవస్థ తగినంతగా లేకపోవడం ఒక కారణం. ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పుడు విద్యుత్‌ను నిల్వ చేసేందుకు కావాల్సిన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్), పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల (పీఎస్పీ) సామర్థ్యం అవసరమైనంత మేర అందుబాటులోకి రాకపోవడం మరో కారణం. అలాగే, దేశీయంగా మొత్తం సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యంలో దాదాపు 75శాతం రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకల్లోనే కేంద్రీకృతమైంది. దాంతో ఆయా చోట్ల ఉత్పత్తి అయ్యే అదనపు విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు తరలించాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఇందుకోసం అంతర్రాష్ట్ర పంపిణీ వ్యవస్థ సామర్థ్యాన్ని మరింతగా పెంచాల్సి ఉంటుంది. వినియోగదారులకు పునరుత్పాదక విద్యుత్‌ను పంపిణీ చేయడంలో తలెత్తుతున్న లోపాలను సరిదిద్దేందుకు కేంద్రం 'గ్రీన్ ఎనర్జీ కారిడార్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. అధిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న రాష్ట్రాల్లో పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, అంతర్రాష్ట్ర విద్యుత్ ప్రసార సామర్థ్యాన్ని పెంచడం, వివిధ రాష్ట్రాల గ్రిడ్‌ల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలు. అయితే భూసేకరణలో సమస్యలు, పర్యావరణ, అటవీ శాఖల అనుమతుల్లో జాప్యం వంటి వాటితో కొన్ని ప్రాజెక్టుల పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగట్లేదు. దీంతో కొత్తగా ఏర్పాటవుతున్న సౌరవిద్యుత్తు కేంద్రాలు ప్రస్తుతం ఉన్న పంపిణీ వ్యవస్థపైనే ఆధారపడాల్సి వస్తోంది. దాని సామర్థ్యం సరిపోక పోవడంతో కొన్ని ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుత్‌ను గ్రిడ్‌లోకి తరలించడం కుదరట్లేదు. ఫలితంగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు లేని, బహిరంగ మార్కెట్లో విక్రయించే సౌర విద్యుత్కేంద్రాలు నష్టాల బారినపడవచ్చు. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్రం భవిష్యత్తులో అందివచ్చే విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని 2034-35 వరకు ప్రసార ప్రణాళికను రూపొందించి ఆయా రాష్ట్రాలకు అందిస్తోంది. ఏదేమైనా పంపిణీ సామర్థ్యం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేదాకా కొంతకాలం పాటు, సౌర విద్యుత్‌ను పూర్తిగా గ్రిడ్‌కు తరలించడం కష్టంగానే కనిపిస్తోంది. సౌరవిద్యుత్ ఉత్పత్తి పగటి సమయంలో ఎక్కువగా ఉండటం, సాయంత్రం వేళల్లో ఒక్కసారిగా తగ్గిపోవడం వల్ల నిల్వవ్యవస్థలు కీలకంగా మారుతున్నాయి. అందుకే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పథకం ద్వారా 'బీఈఎస్ఎస్' నెలకొల్పే కంపెనీలకు కేంద్రం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోంది. పంపిణీ సంస్థలు నిర్దిష్ట స్థాయిలో ఎనర్జీస్టోరేజ్ సామర్థ్యాన్ని నిర్మించడం, కొనుగోలు ఒప్పందాలు చేసుకోవాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ఇక దేశవ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న 'పీఎస్పీ' వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించడానికి మరికొన్నేళ్లు పట్టవచ్చు. వినియోగ ఒప్పందాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం రెన్యువబుల్ పర్చేజ్ ఆబ్లిగేషన్ (ఆర్‌పీవో), రెన్యువబుల్ కన్సంప్షన్ ఆబ్లిగేషన్ (ఆర్‌సీవో) వంటి విధానాలను అమలు చేస్తోంది. వీటిద్వారా నిర్దేశించిన మొత్తంలో కొన్ని కర్మాగారాలు, విద్యుత్ పంపిణీ సంస్థలు పునరుత్పాదక కరెంటును కొనుగోలు చేయడం లేదా వినియోగించడం తప్పనిసరి చేసింది. కానీ, ప్రస్తుతం ఆందోళన కలిగిస్తున్న విషయం ఏంటంటే- ఎలాంటి దీర్ఘకాలిక కొనుగోలు ఒప్పందాలు లేకుండా బహిరంగ మార్కెట్లో విక్రయాలపైనే ఆధారపడిన సౌర విద్యుదుత్పత్తి కేంద్రాల సంఖ్య పెరుగుతోంది. వీటికి ఆదాయ భద్రత కల్పించేందుకు ఉద్దేశించిన విధానాలు సద్వినియోగం కావాలి. సౌరవిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతోపాటు దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు కేంద్రం పలుచర్యలు తీసుకుంటోంది. అయితే ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతున్న వేగానికి అనుగుణంగా పంపిణీ నిల్వ సామర్థ్యాలను అదేస్థాయిలో పెంచడం అతిపెద్ద సవాలుగా మారింది. సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం భవిష్యత్తులో ఇంకా పెరిగే అవకాశం ఉంది. కానీ స్టోరేజ్ ప్రాజెక్టులు, పంపిణీ, మార్కెట్ వ్యవస్థలు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు అదేస్థాయిలో అభివృద్ధి చెందకపోతే- ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో గణనీయమైన భాగాన్ని వినియోగించుకోలేని పరిస్థితి కొనసాగవచ్చు. అందువల్ల ఉత్పత్తి సామర్థ్యంలో వృద్ధితో పాటే అందివస్తున్న విద్యుత్‌ను ఎంతమేరకు సమర్థంగా వాడుకోగలుగుతున్నామనే ప్రశ్నకూ ఎప్పటికప్పుడు సమాధానం వెతకాలి.

# సింహాచలంలో వరుణ జపాల అనంతరం వర్షం

**- అరగంట పాటు కురిసిన వానతో చల్లబడిన సింహగిరి**



విశాఖపట్నం, చైతన్యవారధి: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని లోకకల్యాణం కోసం సింహాచలంలోని శ్రీ త్రిపురాంతక స్వామి ఆలయంలో నిర్వహించిన వరుణ జపాలు, హోమాలు, సహస్ర ఘటాభిషేక పూజల అనంతరం కొండపై వర్షం కురిసింది. గురువారం సాయంత్రం సింహగిరిపై సుమారు అరగంట పాటు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి, ఆహ్లాదకరంగా మారింది. దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు అక్టోబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక వరుణ జపాలు, హోమాలు, సహస్ర ఘటాభిషేకాలను అర్చక పండితులు వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజలు ముగిసిన రెండు రోజుల అనంతరం అక్టోబర్ 8న సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు వర్షం కురిసింది. శ్రీ త్రిపురాంతక స్వామి, అప్పన్న స్వామివారి అనుగ్రహంతోనే పూజల అనంతరం వర్షం కురిసిందని ఆలయ ఈఓ జల్లేపల్లి వెంకట్రావు, అర్చకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కొండపైకి వచ్చిన భక్తులు వర్షపు జల్లుల్లో తడుస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈఓ జల్లేపల్లి వెంకట్రావు మాట్లాడుతూ, లోకక్షేమం కోసం స్వామివారి సన్నిధిలో నిర్వహించిన పూజలకు దైవానుగ్రహం లభించిందని పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసి, జలాశయాలు నిండి, రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అప్పన్న స్వామి, త్రిపురాంతక స్వామివారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# పేదలకు పట్టాభిషేకం.. 17 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**- రూ.12.93 లక్షల ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు**



విశాఖపట్నం, చైతన్యవారధి: పేదలకు సొంతింటి స్థలాలపై పూర్తి హక్కులు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో భాగంగా ఉత్తర నియోజకవర్గంలోని లబ్ధిదారులకు సేల్ డీడ్లను పంపిణీ చేశారు. అక్కయ్యపాలెంలోని షాదీఖానా కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు పాల్గొని సీతమ్మధార, గోపాలపట్నం మండలాలకు చెందిన లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఉత్తర నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు గత కొన్ని రోజులుగా సేల్ డీడ్ల పంపిణీ కొనసాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. పేదలకు సొంతింటి స్థలాలపై హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

17 మందికి రూ.12.93 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం... అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.12,93,932 విలువైన చెక్కులను 17 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందే ఆర్థిక సాయం పేద కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సహాయ కార్యక్రమాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ సాయం పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి ఉషాకిరణ్, వెంకటేష్, అక్కిరెడ్డి జగదీష్, గంకల అప్పారావు, ప్రసాద్, ధనేష్, సుజాత, స్రవంతి, గురు గోవింద్ సింగ్, ఉమా మహేశ్వరరెడ్డి, నాగమణి, అరుణ, లీలావతి, కూటమి వార్డు, మండల అధ్యక్షులు, నాయకులతో పాటు సీతమ్మధార తహసీల్దార్ ఎం.వి.వి. ప్రసాద్, గోపాలపట్నం డిప్యూటీ తహసీల్దార్ రవికృష్ణ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీతమ్మధారలో 19 లీటర్ల మద్యం స్వాధీనం

**- భార్యాభర్తలపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు**



విశాఖపట్నం, చైతన్యవారధి: నగరంలోని సీతమ్మధార ఈనాడు రైతుబజార్ సమీపంలో ఉన్న ఆక్సిజన్ టవర్-బిలోని ఓ ఫ్లాట్‌లో 19 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సుగ్గుణ గీత ప్రసన్న, ఆమె భర్త శివనారాయణపై ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం కింద ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విశాఖపట్నం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 144/2026 కేసు దర్యాప్తులో భాగంగా, చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నుంచి సెర్చ్ వారెంట్ పొందిన సైబర్ క్రైమ్ పోలీసులు అక్టోబర్ 8న మధ్యాహ్నం 1.50 గంటలకు సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్-బి, ఫ్లాట్ నంబర్ 2409లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వివిధ బ్రాండ్లకు చెందిన 18 మద్యం బాటిళ్లు, మొత్తం 19 లీటర్ల మద్యం లభించడంతో సాక్షుల సమక్షంలో పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. సైబర్ క్రైమ్ కేసులో నిందితులు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పాటు సంబంధిత పత్రాలను సైబర్ క్రైమ్ పోలీసులు ఎంవీపీ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఘటనపై నమోదైన కేసు తదుపరి దర్యాప్తు బాధ్యతలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఎన్.ఎస్.వి. ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్ జి. సీతారాంకు అప్పగించారు.

# ప్రకృతి, రసాయన వ్యవసాయంపై క్షేత్రస్థాయి పరిశీలన

**- నేల ఆరోగ్యం, తేమ, పంటల పెరుగుదలపై అధ్యయనం**



భీమిలి, చైతన్యవారధి: ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయం మధ్య ఉన్న తేడాలను తెలుసుకునేందుకు రైతు సాధికార సంస్థ విశాఖపట్నం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బుస్సల శ్యామల ఆధ్వర్యంలో భీమిలి మండలం మజ్జిపేట గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా టీమ్ లీడ్ డాక్టర్ సుధాకర్, సీనియర్ అసోసియేట్ సనత్, వైఆర్ఎఫ్ సుదర్శన్, మెంటార్లు, రైతులు కలిసి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న అప్పలనాయుడు పొలంతోపాటు రసాయన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. రెండు క్షేత్రాల్లో పంటల పరిస్థితి, నేల ఆరోగ్యం, తేమ నిల్వ, పీహెచ్ విలువలు, మట్టి పరీక్ష ఫలితాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నేల ఆరోగ్యం, తేమ నిల్వ, పంటల పెరుగుదలలో కనిపించే మార్పులను రసాయన వ్యవసాయ క్షేత్రంతో పోల్చి అధ్యయనం చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా రెండు వ్యవసాయ పద్ధతుల మధ్య ఉన్న వ్యత్యాసాలను రైతులు, మెంటార్లు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయం మధ్య తేడాలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవడానికి ఈ పరిశీలన ఉపయోగపడిందని పాల్గొన్నవారు తెలిపారు.

# ఇచ్ఛాపురం, పలాసలో రైల్వే సౌకర్యాలపై డీఆర్ఎం తనిఖీ

**- పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు**



విశాఖపట్నం, చైతన్యవారధి: ఇచ్ఛాపురం, పలాస రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాలు, మౌలిక వసతులు, రైల్వే సిబ్బంది నివాసాల పరిస్థితిని విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా విస్తృతంగా తనిఖీ చేశారు. గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించి, పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌తో పాటు రైల్వే కాలనీని సందర్శించిన డీఆర్ఎం, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, ఉద్యోగుల కుటుంబాలకు కల్పించిన వసతులను పరిశీలించారు. అనంతరం పలాసలో రైల్వే స్టేషన్, రైల్వే కాలనీ, రైల్వే ఆసుపత్రి, ఆర్‌పీఎఫ్ బ్యారక్, రన్నింగ్ రూమ్‌తో పాటు లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 362ను తనిఖీ చేశారు. పారిశుధ్యం, భద్రత, మౌలిక వసతుల నిర్వహణపై సమీక్షించారు. తనిఖీల సందర్భంగా స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాలకు, రైల్వే కాలనీల్లో నివాసితుల సమస్యలకు సంబంధించి పలు అంశాలను గుర్తించారు. వాటిని నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఇచ్ఛాపురం, పలాస ప్రాంతాలకు చెందిన రైల్వే వినియోగదారుల ప్రతినిధులు డీఆర్ఎంను కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. వారి సమస్యలను స్వయంగా విన్న ఆయన, సంబంధిత విభాగాల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో కమర్షియల్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# విధుల్లో నిబద్ధతతో ముందుకు సాగాలి

**- నూతన కానిస్టేబుళ్లకు పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి దిశానిర్దేశం - 161 మంది సివిల్ కానిస్టేబుళ్లకు 45 రోజుల ప్రత్యేక శిక్షణ ప్రారంభం**




విశాఖపట్నం, చైతన్యవారధి: పోలీసు విధుల్లో నిబద్ధత, నిజాయితీ, వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు ప్రజల పట్ల మానవతా దృక్పథాన్ని కలిగి ఉండాలని నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి సూచించారు. ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకుని విశాఖపట్నం సిటీ పోలీస్ విభాగానికి రిపోర్ట్ చేసిన 161 మంది సివిల్ పోలీస్ కానిస్టేబుళ్లకు 45 రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నగర పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ (టెంపుల్ ఆఫ్ లెర్నింగ్)లో ప్రారంభించారు. వీరిలో 108 మంది పురుషులు, 53 మంది మహిళలు ఉన్నారు. ఈ ప్రత్యేక శిక్షణలో నగర పరిధిలో పోలీసు విధుల నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, చట్టాలపై అవగాహన, ప్రజలతో వ్యవహరించే తీరు, పోలీస్ స్టేషన్లలో విధుల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. విధి నిర్వహణలో బాధ్యతాయుత ప్రవర్తన, సంయమనం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉన్నందున పోలీసు సిబ్బంది ప్రవర్తనపై ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, అనుచితంగా వ్యవహరిస్తే వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. అలాంటి ఘటనలు వ్యక్తిగత ప్రతిష్ఠతో పాటు పోలీస్ శాఖ గౌరవానికి భంగం కలిగిస్తాయని పేర్కొన్నారు. అవినీతికి దూరంగా ఉంటూ నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, మర్యాదపూర్వకంగా స్పందించాలని సూచించారు. బాధితులను కుటుంబ సభ్యులుగా భావించి మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. ట్రాఫిక్ విధుల్లో ఉన్నప్పుడు అంధులు, ఇతర అవసరాలున్న వారికి రోడ్డు దాటడంలో సహాయం చేయడం వంటి చిన్న చర్యలు కూడా ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని పెంచుతాయని తెలిపారు. పైఅధికారుల సూచనలను పాటిస్తూ విధి నిర్వహణలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నం సిటీ పోలీస్ విభాగం ఒక కుటుంబం వంటిదని పేర్కొన్న కమిషనర్, సిబ్బందికి సెలవులు మంజూరు చేయకపోవడం, రావాల్సిన ప్రయోజనాలు అందకపోవడం లేదా పైఅధికారుల నుంచి అనుచిత ప్రవర్తన ఎదురవడం వంటి సమస్యలను ఆధారాలతో తన దృష్టికి తీసుకువస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకోసం తన వ్యక్తిగత ఫోన్ నంబర్ 7995095799ను అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, నగర పోలీస్ విభాగంలోని పురుష, మహిళా సిబ్బందికి ఆరోగ్య బీమా కల్పించినట్లు తెలిపారు. నూతన కానిస్టేబుళ్లకు కూడా హెల్త్ ఇన్సూరెన్స్ చేయిస్తామని హామీ ఇచ్చారు. సిబ్బంది కుటుంబాల్లో ఆరోగ్యపరమైన లేదా ఇతర సమస్యలు తలెత్తితే ఫోన్ లేదా సందేశం ద్వారా తెలియజేయవచ్చన్నారు. ప్రజలకు పారదర్శకమైన, మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు సిబ్బంది సంక్షేమం, గౌరవం, ఆరోగ్యం, కుటుంబాల భద్రతకు శాఖ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.



# రూ.12.82 కోట్ల అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కొణతాల

**- నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**



అనకాపల్లి, చైతన్యవారధి: అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ పరిధిలో రూ.8.36 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో నిర్మిస్తున్న పార్కు, బీఆర్‌టీ కాలనీలో రూ.4.46 కోట్లతో చేపట్టిన నూతన కళ్యాణ మండపం నిర్మాణ పనులను అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. మొత్తం రూ.12.82 కోట్ల విలువైన అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్కు, కళ్యాణ మండపం నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# బీసీ గర్జన సభను విజయవంతం చేయాలి

**- వైఎస్సార్‌సీపీ రౌండ్ టేబుల్ సమావేశంలో పిలుపు**




విశాఖపట్నం, చైతన్యవారధి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా కార్యాలయం, ఎండాడలో నిర్వహించిన “వెన్నుపోటు పార్టీ వంచనపై బీసీ గర్జన” రౌండ్ టేబుల్ సమావేశంలో ఆ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణికుమారి పాల్గొన్నారు. త్వరలో నిర్వహించనున్న బీసీ గర్జన సభను విజయవంతం చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. బీసీలకు సంబంధించిన ప్రధాన సమస్యలు, హక్కులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన డిమాండ్లపై బీసీ నాయకులతో చర్చించారు. బీసీల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, బూడి ముత్యాలనాయుడు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, సీదిరి అప్పలరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్సీలు రచ్చగొల్ల రమేష్ యాదవ్, నర్తు రామారావు, వరుదు కల్యాణి పాల్గొన్నారు. అలాగే విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షుడు బెల్లాన చంద్రశేఖర్, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయకుమార్, బొత్స అప్పలనర్సయ్య, శోభా హైమావతి, తిప్పల గురుమూర్తిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ బొత్స అనూష, గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్‌రెడ్డి, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్‌తో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థ ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలి

**- నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి**

**- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు పిలుపు**



విశాఖపట్నం, చైతన్యవారధి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు పిలుపునిచ్చారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమై పార్టీ బలోపేతం, నాయకులు--కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. ప్రతి వార్డులో, ప్రతి ఇంటిలో పార్టీ గొంతుక వినిపించేలా శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై స్పందించాలని, ప్రజల నమ్మకాన్ని పొందేలా క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, రెయ్యి వెంకటరమణ, కె. అనిల్ కుమార్ రాజు, గుజ్జు వెంకటరెడ్డి, కడితి చిరంజీవి, నీలి రవి, కె. సుకుమార్, ఎర్రశెట్టి శ్రీనివాసరావు, సారిపిల్లి సంతోష్, బంగారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిరస్కరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించాలి

**- ఓటు తొలగింపునకు స్పష్టమైన కారణం నమోదు చేయాలి - రోల్ అబ్జర్వర్ ఎస్. భార్గవి ఆదేశం**




విశాఖపట్నం, చైతన్యవారధి: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల పరిశీలన, డేటా ధ్రువీకరణ, ఓట్ల తొలగింపు ప్రక్రియలను ఎన్నికల నిబంధనల ప్రకారం బాధ్యతాయుతంగా నిర్వహించాలని రోల్ అబ్జర్వర్ ఎస్. భార్గవి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో నియోజకవర్గాల వారీగా పురోగతి, దరఖాస్తుల తిరస్కరణలు, ఓట్ల తొలగింపులు, సూపర్ చెక్ ప్రక్రియలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలు, ఈసీఐ నెట్‌లో నమోదైన సమాచారం సరిపోలేలా చూడాలని సూచించారు. తిరస్కరించిన దరఖాస్తులు, ఓట్ల విషయంలో సందేహాలు ఉంటే రికార్డులకే పరిమితం కాకుండా అవసరమైన చోట క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ పరిస్థితులను నిర్ధారించుకోవాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా నుంచి ఓటును తొలగించే ముందు అందుకు సంబంధించిన స్పష్టమైన కారణాన్ని నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇంటి నంబర్లలో వ్యత్యాసాలు ఉన్న అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని, గతంలో ఓటు వేసిన వారి వివరాల్లో గణనీయమైన మార్పులు కనిపించే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని భార్గవి సూచించారు. పెద్ద సంఖ్యలో ఓట్ల చేర్పులు లేదా తొలగింపులు నమోదైన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి ధ్రువీకరణ చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పరిశీలనలు, దరఖాస్తుల ధ్రువీకరణ, సూపర్ చెక్ ప్రక్రియలను వేగవంతం చేయాలని, స్వీప్ కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని తెలిపారు. నియోజకవర్గాల వారీగా పనితీరును సమీక్షిస్తూ విశాఖ దక్షిణ నియోజకవర్గంలో చేపట్టిన పని బాగుందని పేర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గంలో మరింత నాణ్యతతో, లోతైన పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పటిష్ఠంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గైర్హాజరు (ఆబ్సెంట్), వేరే ప్రాంతానికి మారిన (షిఫ్టెడ్), ద్వంద్వ (డూప్లికేట్), మరణించిన (డెత్) కేటగిరీల్లో గుర్తించిన ఓట్లకు సంబంధించి నోటీసుల జారీ, పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియను నిబంధనల మేరకు చేపడుతున్నట్లు వివరించారు.

# గంటా సమక్షంలో 200 మందికి పైగా టీడీపీలో చేరిక

**- శొంట్యాం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలకు పసుపు కండువాలు కప్పి ఆహ్వానం**



విశాఖపట్నం, చైతన్యవారధి: ఆనందపురం మండలం శొంట్యాం గ్రామానికి చెందిన 200 మందికి పైగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన కోరుకొండ ప్రసాద్ నాయకత్వంలో గురువారం ఎంవీపీ కాలనీలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయానికి చేరుకున్న కార్యకర్తలకు ఎమ్మెల్యే పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు టీడీపీ, జనసేనలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తుపై ప్రజలు కూటమిపై విశ్వాసం ఉంచుతున్నారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ రాజకీయ భవిష్యత్తు అంధకారంగా మారుతుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, తాత్రాజు అప్పారావు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, అచ్చిబాబు, రాంబాబు, మదపాటి శ్రీను, ఎర్రరాజు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# విశాలాక్షి నగర్‌లో రక్షణ చర్యలు చేపట్టాలి

**- హనుమంతవాక జంక్షన్‌లో ఫ్రీ లెఫ్ట్‌ల విస్తరణకు చర్యలు - కూలిన రక్షణ గోడను పరిశీలించిన ఎమ్మెల్యే వెలగపూడి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**




విశాఖపట్నం, చైతన్యవారధి: విశాలాక్షి నగర్ కొండవాలు ప్రాంతంలో ప్రజల భద్రతకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని, హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రహదారుల విస్తరణతో పాటు ఫ్రీ లెఫ్ట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. గురువారం విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి ఈస్ట్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. విశాలాక్షి నగర్ రామాలయం వీధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండవాలుపై ఉన్న ఇంటి రక్షణ గోడ కూలి సమీపంలోని ఇళ్లపై పడిన ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ప్రమాదాన్ని గుర్తించి సంబంధిత కుటుంబాలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన రక్షణ గోడ నిర్మించాలని, పరిసర ఇళ్లకు ప్రమాదం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ఘటనపై రెవెన్యూ అధికారుల నుంచి నివేదిక తీసుకోవాలని కమిషనర్ సూచించారు. పటిష్ఠమైన కాంక్రీట్ రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు, అంచనాలతో సమగ్ర నివేదికను సమర్పించాలని కార్యనిర్వాహక ఇంజినీర్ గంగాధర్‌ను ఆదేశించారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, అవసరమైన కుటుంబాలకు తాత్కాలిక ఆశ్రయం కల్పించాలని సూచించారు. అనంతరం హనుమంతవాక జంక్షన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే, కమిషనర్ ట్రాఫిక్ సమస్యలపై సమీక్షించారు. సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచిపోవడంతో తరచూ రద్దీ ఏర్పడుతోందని ఎమ్మెల్యే వివరించారు. విశాలాక్షి నగర్ వైపు వెళ్లే రహదారితో పాటు బీఆర్‌టీఎస్ మార్గంలో అవసరమైన చోట్ల రహదారులను విస్తరించి, వాహనాలు సులభంగా వెళ్లేందుకు ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. రహదారుల విస్తరణకు అవసరమైన స్థలాలు ఆంధ్ర విశ్వవిద్యాలయం లేదా ఇతర ప్రభుత్వ శాఖలకు చెందినవైతే, ఆయా శాఖలతో సమన్వయం చేసుకుని అనుమతులు పొందాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. స్థల వివరాలు, విస్తరణ ప్రతిపాదనలు, అంచనాలతో కూడిన సమగ్ర నివేదికను త్వరగా సమర్పించాలని డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, కార్యనిర్వాహక ఇంజినీర్‌కు సూచించారు. ఫ్రీ లెఫ్ట్‌ల ఏర్పాటుతో వాహనాల రాకపోకలు సులభతరమై ట్రాఫిక్ రద్దీ, రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో జీవీఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, కార్యనిర్వాహక ఇంజినీర్ గంగాధర్, సహాయక వైద్యాధికారి బి. ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గృహ యజమానులకు రిజిస్ట్రేషన్ పట్టాలు తక్షణమే ఇవ్వాలి

**- ములగాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నిరసన - సామూహిక దరఖాస్తులు, వినతిపత్రం సమర్పణ**



విశాఖపట్నం, చైతన్యవారధి: ములగాడ మండల పరిధిలోని నూతన 75 నుంచి 82 వార్డుల పరిధిలో గృహ యజమానులకు రిజిస్ట్రేషన్ పట్టాలు, కన్వేయన్స్ డీడ్స్ తక్షణమే అందించాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోరుతూ సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ములగాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీ నిరసన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రంతో పాటు సామూహిక దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, జిల్లాలోని పలు ప్రాంతాల గృహ యజమానులకు ప్రభుత్వం ఇటీవల కన్వేయన్స్ డీడ్స్ రూపంలో రిజిస్ట్రేషన్ పత్రాలు అందించినప్పటికీ, ములగాడ మండల పరిధిలోని అనేక ప్రాంతాల ప్రజలకు ఇంకా పూర్తి హక్కు పత్రాలు అందలేదని అన్నారు. 78వ వార్డు పరిధిలోని మల్కాపురం గ్రామం సుమారు 100 ఏళ్ల క్రితం ఏర్పడిందని, చమురు పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణలో భాగంగా 29.25 ఎకరాల్లో పునరావాస గ్రామంగా ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేసిందని వివరించారు. ప్రజలు లక్షల రూపాయలు వెచ్చించి ఇళు నిర్మించుకున్నప్పటికీ రిజిస్ట్రేషన్ జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మల్కాపురం భూములు పోర్టుకు చెందినవని చెబుతున్నారని, అదే నిజమైతే పోర్టుకు ప్రత్యామ్నాయంగా మరోచోట భూమి కేటాయించి, స్థానిక నివాసితులకు పూర్తి హక్కు పత్రాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇతర ప్రాజెక్టులకు భూముల కేటాయింపులో ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ, ఇక్కడి ప్రజల సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శించారు. నూతన 76, 77 వార్డుల పరిధిలోని జై ఆంధ్రా కాలనీ, కాకరలోవ, చింతలలోవ ప్రాంతాలకు జీవో 296 ప్రకారం పట్టాలు ఇచ్చినా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిపివేశారని జగ్గునాయుడు పేర్కొన్నారు. ఈ ప్రాంతాలు దశాబ్దాల క్రితమే ఏర్పడిన పురాతన నివాస ప్రాంతాలని, ప్రస్తుతం నావెల్ ఏరియా పేరుతో ప్రజల్లో ఆందోళన నెలకొందని తెలిపారు. 80వ వార్డు పరిధిలోని గుల్లపాలెం ప్రజలకు కూడా పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయలేదని, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విశాఖలో ప్రతి గృహ యజమానికి పూర్తి హక్కు పత్రాలు అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో ములగాడ మండల పరిధిలో సుమారు 10 వేల మందికి రిజిస్ట్రేషన్ పట్టాలు అందించాల్సి ఉందని జగ్గునాయుడు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే తక్షణమే జోక్యం చేసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి. పైడ్రాజు మాట్లాడుతూ, 77, 78, 79, 80, 81, 82 వార్డుల పరిధిలో కొంతమందికి కన్వేయన్స్ డీడ్స్ ఇచ్చినా, ఇంకా వందలాది మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాలేదన్నారు. పట్టాదారులు మరణించడం, తాత్కాలిక ఇళ్లు ఉండటం, తప్పనిసరి పరిస్థితుల్లో ఇళ్ల కొనుగోలు, విక్రయాలు జరగడం వంటి కారణాలతో పలువురికి రిజిస్ట్రేషన్ నిలిచిపోయిందని తెలిపారు. అర్హులందరికీ తక్షణమే పత్రాలు అందించాలని కోరారు. సీపీఎం జోన్ నాయకులు కె. పెంటారావు, బి. మమత, వి. బాబురావు మాట్లాడుతూ, ప్రజలు ప్రభుత్వాన్ని అదనపు నిధులు కోరడం లేదని, తమ ఇళ్లకు పూర్తి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని మాత్రమే అడుగుతున్నారని అన్నారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే గణబాబు, ఎంపీ ఈ సమస్యపై స్పందించాలని కోరారు. కన్వేయన్స్ డీడ్స్ అందించకపోతే ఆందోళనను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం. సత్యారావు, పి. రామారావు, పి.వి. భాస్కరరావు, ఎస్. వాసు, జి. నరేష్, పి. వరలక్ష్మి, బి. నిర్మల, ఎన్. ఉమ, ఈశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాలి

**- సంక్షేమ బోర్డు ద్వారా అన్ని పథకాలు అమలు చేయాలి**

**- కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా**




విశాఖపట్నం, చైతన్యవారధి: భవన నిర్మాణ కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాలని, ప్రమాదాల కారణంగా అంగవైకల్యానికి గురైన వారికి తగిన నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో కొత్త కార్మికుల నమోదు, పాత కార్మికుల రెన్యూవల్స్‌ను ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానంలోనూ చేపట్టాలని కోరుతూ విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పి. అనసూయ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి ప్రమాద బీమా, నష్టపరిహారం, ఇతర సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల నమోదు, రెన్యూవల్ ప్రక్రియను సులభతరం చేసి, ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి. కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో సుమారు రూ.4,500 కోట్ల నిధులు ఉన్నాయని, బోర్డు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు రూ.1,500 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. నిర్మాణ రంగంలో చోటుచేసుకుంటున్న ప్రమాదాల్లో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని, మరికొందరు కాళ్లు, చేతులు కోల్పోయి, తీవ్ర గాయాలతో జీవితాంతం ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రమాదాల్లో మరణించిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ప్రమాద బీమా అందిస్తున్నారని కుమార్ తెలిపారు. రాష్ట్రంలో గతంలో అమలైన రూ.5 లక్షల ప్రమాద పరిహారాన్ని కూడా నిలిపివేశారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు సంక్షేమ పథకాల అమలుపై హామీలు ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని పథకాలనే పరిమితంగా అమలు చేస్తోందని విమర్శించారు. గతంలో అమలైన సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరించాలని, కార్మిక శాఖ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తులు స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ విధానం వల్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి అనుకూలంగా రెండు విధానాల్లోనూ సేవలు అందుబాటులో ఉంచాలని కోరారు.

# లీజుల వేలానికి ముందే అనుమతులన్నీ తీసుకోవాలి

**- గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర**



అమరావతి: లీజుల వేలానికి ముందే ఖనిజ నిర్ధారణ, పర్యావరణ అనుమతులు, మైనింగ్ ప్లాన్ అనుమతి వంటివన్నీ పొందడం ద్వారా పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని అధికారులను గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. రాష్ట్రంలో వీలైనన్ని ఎక్కువ బ్లాకుల్లో ఖనిజాన్వేషణ చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గురువారం మంత్రి అధ్యక్షతన ఖనిజాన్వేషణ, పరిశోధన ట్రస్ట్ (మెరిట్) గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో ఖనిజాన్వేషణ కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలన్నారు. మెరిట్‌లో రూ.156.05 కోట్లతో వివిధ ఖనిజాల అన్వేషణకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. లీజులకు వేలం నిర్వహించిన తర్వాత వాటికి అవసరమైన అనుమతులు పొందేందుకు నాలుగేళ్లు పడుతోందని, అందుకే ముందే అనుమతులు తీసుకొని, లీజుల వేలానికి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పల్నాడు, ఎన్టీఆర్, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాల పరిధిలో 10 సున్నపురాయి లీజులకు ఇదే విధంగా ముందస్తు అనుమతులన్నీ తీసుకునే ప్రక్రియ వేగవంతం చేసినట్లు వెల్లడించారు. మార్కాపురం, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో కొత్తగా 10 ప్రాంతాల్లో క్వార్ట్జ్ కోసం ఖనిజాన్వేషణ చేపట్టడం, తిరుపతి జిల్లా మంగంపేట గనుల వద్ద మరిన్ని ముగ్గురాయి నిల్వలు కనుగొనేందుకు క్వాంటమ్ గ్రావీమీటర్ విధానంలో అన్వేషణ చేసి, త్రీడీ మ్యాప్ సిద్ధం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరిలోని భారత్ గోల్డ్‌మైన్స్‌కు చెందిన లీజులో..గతంలో శుద్ధిచేసి వదిలేసిన డంప్‌లో.. ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానంతో శుద్ధి చేస్తే, ఇంకా బంగారం వచ్చే అవకాశం ఉందా అనేది అన్వేషించాలని నిర్ణయించారు.

# వైకాపా హయాంలో తిరుమలకు కల్తీ నెయ్యి నిజమే

**- విజయసాయి రెడ్డి - జంతువుల కొవ్వు మాత్రం కలవలేదు**



తిరుపతి: గత ప్రభుత్వంలో తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా జరిగిన మాట వాస్తవమేనని మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి అన్నారు. జంతు కొవ్వు మాత్రం కలవలేదన్నారు. 2019-24 మధ్య కిలో నెయ్యి రూ.320- రూ.419కు కొన్నారని తెలిపారు. ప్రస్తుతం స్వచ్ఛమైన నెయ్యి మార్కెట్లో కిలో రూ.వెయ్యి ఉందని, ఇప్పుడు తిరుమలకు రూ.658కే సరఫరా చేస్తున్నారని, ఇది నాణ్యమైన నెయ్యేనా అని ప్రశ్నించారు. ఆయన తిరుపతిలో విలేకర్లతో మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి జగన్ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని దుయ్యబట్టారు. పేరు వెనుక 'రెడ్డి' అని తగిలించుకుని ఆ కులం ఓట్లు, క్రైస్తవుడినని వారి ఓట్లు, ముస్లింల వద్దకు వెళ్లి సెక్యులర్‌నని చెప్పి ఆ మతం ఓట్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మూడు మతాల వారినీ జగన్ మోసం చేస్తున్నారన్నారు. 'కేంద్రంలో మోదీ ప్రభుత్వం చక్కగా పరిపాలిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోంది. సొంతంగా బలమున్న తెదేపాను జనసేన, భాజపాలు ప్రశ్నించలేకపోతున్నాయి. 2016-18 మధ్య ఎన్డీయే నుంచి తెలుగుదేశాన్ని పంపించాలని అహర్నిశలు శ్రమించా. చాలా ప్రయోగాలు చేసి విజయవంతమయ్యా. రాయలసీమలో కనీసం 50 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. మా పార్టీ అధికారంలోకి వస్తే వెయ్యి టీఎంసీల నీరు నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకుంటాం. తితిదే బోర్డును రద్దు చేసి, రాజకీయ నాయకులకు ప్రవేశం లేకుండా చూస్తాం. మఠాధిపతులు, పీఠాధిపతులకే స్థానం కల్పిస్తాం. తిరుమల చుట్టూ ప్రహరీ నిర్మిస్తాం' అని విజయసాయిరెడ్డి చెప్పారు.

# ఆధునిక విధానాలతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి కృషి

**- 'టూరిజం ఇన్నోవేషన్ సమిట్-2026లో మంత్రి దుర్గేష్**




అమరావతి: అంతర్జాతీయ పర్యాటక రంగంలో వస్తున్న మార్పులు, సాంకేతికత, ఇతర ఉత్తమ విధానాలను రాష్ట్ర పర్యాటకాభివృద్ధి కోసం అమలు చేయడానికి కృషి చేస్తానని ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. స్పెయిన్‌లో నిర్వహిస్తున్న 'టూరిజం ఇన్నోవేషన్ సమిట్-2026లో పాల్గొన్న మంత్రి.. అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పర్యాటక రంగ నిపుణులతో గురువారం ముఖాముఖి చర్చించారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల విశిష్టతలను వారికి వివరించారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం ద్వారా దేశ, విదేశీ పెట్టుబడిదారులు పెద్దఎత్తున రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. రెండేళ్ల వ్యవధిలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులు సాధించామని పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతలపై ముద్రించిన ప్రత్యేక సావనీర్‌ను వారికి అందజేశారు.

# క్షయ నిర్మూలనలో యువత 'జోష్'గా ముందుకు సాగాలి

**- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్**



అమరావతి: క్షయ వ్యాధి నిర్మూలనను ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. దిల్లీ వేదికగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ (జోష్) జాతీయ కార్యక్రమానికి అనుగుణంగా మంగళగిరిలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్త జోష్ కార్యక్రమాన్ని మంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. జోష్ బృందాల్లో అధికారులు, మై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలు, ఎన్‌సీసీ క్యాడెట్లు భాగస్వాములవుతారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, కమిషనర్ చక్రధర్‌బాబు, ఆయుష్ డైరెక్టర్ గోపాలకృష్ణ, డీపీహెచ్ వెంకటరమణ, క్షయ నియంత్రణ విభాగం జేడీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రానికి పురస్కారం

**- చెన్నైలో విండ్ ఇండియా-2026 సదస్సు - అవార్డు అందుకున్నడ్‌క్యాప్ వీసీ, ఎండీ కమలాకర్‌బాబు**




అమరావతి: పర్యావరణహిత హరిత ఇంధన రంగంలో పెట్టుబడులు ఆకర్షించినందుకు 'లీడర్‌షిప్ స్టేట్ ఇన్ రెన్యూవబుల్ ఎనర్జీ ఇన్వెస్ట్‌మెంట్ మొబిలైజేషన్' అవార్డు రాష్ట్రానికి దక్కింది. 2024 జూన్ నుంచి ఇప్పటికి రికార్డు స్థాయిలో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు.. 4.71 లక్షల మందికి ఉపాధి కల్పించేలా 97 ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినందుకు అవార్డు లభించింది. చెన్నై ట్రేడ్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన 8వ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన, సదస్సు 'విండ్ ఇండియా-2026'లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున నెడ్‌క్యాప్ వీసీ, ఎండీ కమలాకర్‌బాబు కేంద్ర నూతన పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, తమిళనాడు మంత్రి సిటీఆర్ నిర్మల్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రాష్ట్రంలో 26.45 గిగావాట్ల సౌర, 5.86 గిగావాట్ల పవన, 19.95 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. 12.6 మెగావాట్ అవర్‌ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బెస్), ఏటా 2.20 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్, దాని ఉప ఉత్పత్తులు, 2 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ తయారీ ప్లాంట్లు, రోజుకు 11,521 టన్నుల కంప్రెస్డ్ బయో గ్యాస్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతించింది. కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ, ఇండియన్ విండ్ టర్బైన్ మ్యాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ సంయుక్తంగా 'విండ్-పవరింగ్ ఇండియాస్ ఎనర్జీ రెసిలెన్స్' నినాదంతో ఈ నెల 7 నుంచి మూడ్రోజుల పాటు సదస్సును నిర్వహిస్తోంది. హరిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడమే కాకుండా ఆధునిక సాంకేతికతలతో కూడిన సమగ్ర ఇంధన పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో రాష్ట్రం వ్యవహరిస్తున్న తీరుకు పురస్కారం నిదర్శనమని పేర్కొన్నారు.

# ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం నేటివ్ స్ప్రౌట్ ఉత్పత్తులు

**- రైతుల పంటల నుంచి నేరుగా వినియోగదారుల ఇంటికి ప్రకృతి ఉత్పత్తులు - ప్రకృతి వ్యవసాయ రైతులకు మేలు చేకూర్చడమే లక్ష్యం- విజయరాం**



విశాఖపట్నం, చైతన్యవారధి: ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రకృతి ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా నేటివ్ స్ప్రౌట్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సేవ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రకృతి వ్యవసాయ రైతు విజయరాం తెలిపారు. ఎండాడలోని తృప్తి ప్రకృతి పంటల భోజనశాలలో శ్రీకాకుళం జిల్లా గోవర్ధనపురం గోశాల వ్యవస్థాపకుడు దొడ్డా మహేష్ నేతృత్వంలో నేటివ్ స్ప్రౌట్ ఉత్పత్తుల ఆన్‌లైన్ విక్రయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయరాం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ రైతుల సంక్షేమం, ఆరోగ్యకరమైన ఆహారం కోరుకునే వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నేటివ్ స్ప్రౌట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా దొడ్డా మహేష్ చేపట్టిన ఈ కార్యక్రమం రైతులకు, వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల పొలాల నుంచి నేరుగా వినియోగదారుల ఇళ్లకు ఉత్పత్తులను చేరవేయడం ద్వారా మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రకృతి ఆధారిత సాగు జీవావరణ పరిరక్షణకు దోహదపడుతుందని, ప్రభుత్వం రైతులకు మరింత సహకారం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ నర్సరీ గ్రోవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల చలపతిరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ రైతులకు నేటివ్ స్ప్రౌట్ చక్కని అవకాశమని అన్నారు. తులసీ నేచురల్స్ ప్రతినిధి సత్యనారాయణ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను రైతుల నుంచి సేకరించి వినియోగదారులకు అందించేందుకు సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా దేశీయ ఆవు పాలు నుంచి తయారుచేసిన నెయ్యి, కట్టె గానుగ నూనెల ఆన్‌లైన్ విక్రయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోవర్ధనపురం గోశాల ప్రతినిధి లక్ష్మి, గో ఆధారిత ప్రకృతి రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల ఫ్రంట్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఆర్.ఎన్. వర్మ, గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం, సమన్వయకర్త భాస్కర్, సంకల్ప కళా గ్రామం ప్రతినిధులు ఆకుల జమీలియా, పార్వతి, నేటివ్ స్ప్రౌట్ ప్రతినిధులు రాజేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలి

**- ఓటర్ల జాబితా పరిశీలకురాలు ఎం. గౌతమి ఐఏఎస్ ఆదేశం - పాయకరావుపేట, ఎలమంచిలి, చోడవరం నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల తనిఖీ**



అనకాపల్లి, చైతన్యవారధి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని, ఎవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని ఓటర్ల జాబితా పరిశీలకురాలు ఎం. గౌతమి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట, ఎలమంచిలి, చోడవరం నియోజకవర్గాల్లో పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదుతో పాటు పేర్ల తొలగింపు, చిరునామా మార్పులకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్వోలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్వోలకు) సూచించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్ల జాబితాలను క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారంతో సరిపోల్చి, తప్పులు లేకుండా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి

**- రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయింది: కలెక్టర్ విజయ కృష్ణన్ - 6,333 పోలింగ్ కేంద్రాలను వర్గీకరించి భద్రతా ప్రణాళిక సిద్ధం చేయాలి**



అనకాపల్లి, చైతన్యవారధి: జిల్లాలో స్థానిక సంస్థలు, పురపాలక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు వెల్లడించారు. గురువారం అమరావతిలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ (రిటైర్డ్ ఐఏఎస్) నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల సన్నద్ధతను వివరించారు. అనకాపల్లి కలెక్టరేట్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రెండు మున్సిపాలిటీలతో పాటు జీవీఎంసీ పరిధిలోని 9వ జోన్‌కు సంబంధించి పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు, రిజర్వేషన్ల ఖరారుకు అవసరమైన మార్గదర్శకాల అమలును పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి నియామకానికి సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యాయని, సంబంధిత అధికారి త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ పనులకు సంబంధించి నిర్దేశిత గడువులోగా గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, మాస్టర్ రోల్స్ సక్రమంగా రూపొందించాలని ఆదేశించారు. గత ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల జాబితాలను పునఃపరిశీలించి వివరాలు సమర్పించాలని సూచించారు. రిజర్వేషన్ల రూపకల్పనలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాలోని 6,333 పోలింగ్ కేంద్రాలను సాధారణ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా వర్గీకరించిన జాబితాను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గత ఐదేళ్లలో పోలింగ్ సమయంలో తలెత్తిన సమస్యలు, ఘర్షణల వివరాలను స్థానిక సీఐలు, ఎంఆర్ఓలతో సమీక్షించి సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు. ఈ వర్గీకరణ ఆధారంగానే సీసీటీవీల ఏర్పాటు, వీడియోగ్రఫీ, పోలీసు బలగాల మోహరింపుపై పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. గత ఎన్నికల వివరాలు, నిబంధనలను పరిశీలించి నిపుణుల సలహాలతో రిజర్వేషన్ల జాబితా ముసాయిదాను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారం పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ గత ఎన్నికల పరిస్థితులను ప్రస్తుత పరిస్థితులతో పోల్చి, ఎస్‌హెచ్‌ఓలతో కలిసి పోలింగ్ కేంద్రాలను పునఃపరిశీలించాలని సూచించారు. పరిమితంగా ఉన్న పోలీసు బలగాలను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు ప్రహరీ గోడలు ఉండేలా చూడాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించాలని సూచించారు. పోలింగ్ రోజున ఓటర్లకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ శాంతిభద్రతలను కాపాడాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సందీప్, మున్సిపల్ కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ టెట్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**- 5,624 మంది అభ్యర్థులు.. జిల్లాలో 6 పరీక్షా కేంద్రాలు**



విశాఖపట్నం, చైతన్యవారధి: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (స్పెషల్ టెట్) పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 11 నుంచి 15వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, మొత్తం 5,624 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పించాలని, తగినంత పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు. బీఎన్ఎస్ సెక్షన్ 163 అమలుతోపాటు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అభ్యర్థులకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు అవసరమైన బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షలు జరిగే అన్ని రోజుల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని, తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ, జీవీఎంసీ అధికారులకు సూచించారు. అభ్యర్థులకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం అందించేందుకు జిల్లా స్థాయిలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఈఓ ప్రేమకుమార్, ఆర్ఐఓ మురళీధర్, ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఎమోషనల్ సెక్యూరిటీతో లైఫ్ బిందాస్ !



లవ్ అండ్ రిలేషన్‌షిప్ ప్రారంభించడం మాత్రమే కాదు, దానిని లైఫ్‌లాంగ్ నిలబెట్టుకోవడం కూడా చాలా ముఖ్యమని నిపుణులు చెప్తున్నారు. ఎందుకంటే మారుతున్న కాలంతోపాటు మానవ సంబంధాల్లోనూ పలు మార్పులు వస్తున్నాయి. ఒకప్పటిలాగా పరిస్థితులు ఎలా ఉన్నా సర్దుకుపోవడం లేదా భాగస్వాముల్లో ఒకరు ఆధిపత్య ధోరణి ప్రదర్శించడం, ఎమోషనల్ సెక్యూరిటీ లేకపోవడం నేడు ఎవరికీ నచ్చడం లేదు. ఈ జనరేషన్‌లో ఎవరైనా అలా ఉంటున్నారంటే వారి సంబంధం ఎక్కువకాలం నిలబడే అవకాశం తక్కువ. అందుకే హెల్తీ అండ్ స్ట్రాంగ్ రిలేషన్‌షిప్ ఎమోషనల్ సేఫ్టీ లేదా సెక్యూరిటీ చాలా ముఖ్యమని నిపుణులు అంటున్నారు. అదెలాగో చూద్దాం. ఎమోషనల్ సేఫ్టీ అంటే పరస్పర గౌరవం, ప్రేమ మాత్రమే కాదు, ఆపద సమయాల్లో, బలహీన పరిస్థితుల్లో కూడా భాగస్వాములు ఒకరినొకరు అర్థం చేసుకోవడం. భావాలు, భావోద్వేగాలు, అనుభవాలను పంచుకోవడం. అలాగే మ్యూచువల్ రెస్పెక్ట్ ఇచ్చి పుచ్చుకోవడం.. ఇవన్నీ ఎమోషనల్ సేఫ్టీ లేదా సెక్యూరిటీని పెంపొందిస్తాయి. పార్ట్‌నర్స్‌లో ఎవరో ఒకరికి ఇబ్బందికర పరిస్థితి ఎదురైనప్పుడు లేదా ఏమీ తోచక తడబడుతున్నప్పుడు, ఎమోషనల్ సిచ్యువేషన్‌లో ఉన్నప్పుడు 'నువ్వెప్పుడూ అంతే.. ఏదీ సక్రమంగా చేయవు.. ఏదీ రాదు' అనే మాటలు కొందరు ఉపయోగిస్తుంటారు. కానీ దీనివల్ల నష్టం జరుగుతుంది. అలా కాకుండా "ఏం జరిగినా నీకు నేనున్నాను. నిన్ను నమ్ముతున్నాను. నీ ఫీలింగ్స్ అర్థం చేసుకోగలను. సమస్యలు, సవాళ్లు అందరికీ ఎదురవుతాయి. భయపడకు" వంటి మాటలు ఎదుటి వ్యక్తిలో ఒక భరోసాను కలిగిస్తాయి. అవతలి వ్యక్తికి భావోద్వేగ మద్దతు లభిస్తుంది. ఎమోషనల్ సెక్యూర్‌గా ఫీలవడంతోపాటు మీపై మరింత ప్రేమను పెంచుకుంటారు.

రహస్యాలు దాచాలి: తమ పర్సనల్ రిలేషన్‌లో ఏం జరిగినా ఆ విషయాలను మూడో వ్యక్తితో షేర్ చేసుకుంటూ ఉంటారు కొందరు. కానీ ఇది మంచిది కాదు. భాగస్వాముల్లో ఒకరికి ఇలాంటి ప్రవర్తన నచ్చకపోతే బంధం తెగిపోయే చాన్స్ ఎక్కువ. సీక్రెట్స్ దాచలేని వ్యక్తితో కలిసి ఉండటం కంటే విడిపోవడమే బెటర్ అనుకుంటారు. అందుకే దంపతులు లేదా ప్రేమికులు తమకంటూ కొన్ని సరిహద్దులు, రహస్యాలు ఉంటాయని గుర్తించాలి. వాటిని తమ వరకే ఉంచుకోవాలి. ఇతరులతో షేర్ చేసుకోవద్దు. రహస్యాలను దాచగలిగే వ్యక్తిని ఎవరూ వదులుకోరు. పైగా అటువంటి వ్యక్తి తమ జీవిత భాగస్వామిగా ఉండాలని చాలా మంది కోరుకుంటారు.

చెప్పడానికి వెనుకాడే విషయాల్లో ..ప్రేమించిన వ్యక్తి అయినా, భర్త లేదా భార్య అయినా అన్ని విషయాలూ ఓపెన్‌గా చెప్పలేని సందర్భాలు కూడా కొన్ని ఉంటాయి. అవతలి వ్యక్తి ఎలా రిసీవ్ చేసుకుంటారో, ఏమనుకుంటారోనని వెనుకడుగు వేస్తుంటారు. ఇలాంటి సందర్భాన్ని మీరే అర్థం చేసుకోవడంవల్ల రిలేషన్‌షిప్ మరింత స్ట్రాంగ్‌గా మారుతుంది. అవతలి వ్యక్తి చెప్పడానికి ఇబ్బంది పడినా.. మీరు అర్థం చేసుకొని 'పర్లేదు. నాపై నమ్మకం ఉంచి చెప్పు అని ప్రోత్సహించడం' అనేది ఎమోషనల్ సేఫ్టీని పెంచుతుంది. మీ బంధాన్ని బలంగా మారుస్తుంది.

# నిత్యం ఒత్తిడికి గురవుతున్నారా?



బిజీ లైఫ్ షెడ్యూల్, వర్క్ అండ్ ఫ్యామిలీ టెన్షన్స్ వల్ల ఈరోజుల్లో చాలామంది ఒత్తిడికి గురవుతున్నారు. ఈ పరిస్థితి దీర్ఘకాలంపాటు కొనసాగితే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. స్ట్రెస్, యాంగ్జైటీస్ అధికం కావడం వల్ల పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ కూడా బ్యాలెన్స్ తప్పుతుంది. ఫలితంగా మానసిక, శారీరక అనారోగ్యాలకు కారణం అవుతుంది. అందుకే రోజువారీగా మిమ్మల్ని ఒత్తిడికి గురిచేసే పరిస్థితులు ఏవి? సంతోషంగా ఉండాలంటే ఏం చేయాలి? తదితర విషయాలు తెలుసుకుందాం. గంటల తరబడి పనిలో నిమగ్నం అవడం, జర్నీ చేయడం వంటివి మిమ్మల్ని ఒత్తిడికి గురిచేస్తుంటాయి. అయితే ఇలాంటి సందర్భాల్లో చాలామంది ఆన్‌లైన్‌లో బిజీ అవుతుంటారు. దీనివల్ల ఒత్తిడి మరింత పెరుగుతుంది. రిలాక్స్ అవ్వాలంటే మీ దిన చర్యను అందుకు భిన్నంగా మార్చండి. రోజూ కొంత సమయం మీ కుటుంబ సభ్యులు లేదా స్నేహితులు, కొలీగ్స్‌తో మాట్లాడేందుకు కేటాయించండి. కలిసి బయటకు వెళ్లడం, కలిసి భోంజేయడం వంటివి చేయవచ్చు. మీకు ఇష్టమైన వ్యక్తితో చర్చిచడం కూడా మేలు చేస్తుంది. మీరు మెంటల్లీ యాక్టివ్ ఉండాలంటే ఫిజికల్ ఫిట్‌నెస్ కూడా అవసరం. అందుకని తరచూ వ్యాయామం, స్విమ్మింగ్ సైక్లింగ్, జాగింగ్, రన్నింగ్ వంటివి చేస్తూ ఉండండి. ఇవి రోజువారీ ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా చురుకుదనాన్ని, శారీర ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. మీరు స్ట్రెస్ ఫీలవుతుంటే గనుక దానిని డైవర్ట్ చేయడానికి కొత్త విషయాలపై ఫోకస్ పెట్టవచ్చు. పుస్తకం చదవడం, వాకింగ్ చేయడం, ఇష్టమైన వ్యక్తితో గడపడం వంటివి మీలోని ఇబ్బందిని దూరం చేస్తాయి. ఆత్మ విశ్వాసాన్ని పెంచుతాయి. అలాగే మీకు ఇష్టమైన పనులు చేయడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం కూడా మేలు ఒత్తిడిని దూరం చేస్తాయి.

# ఎండాకాలంలో స్విమ్మింగ్ చేస్తున్నారా..!



ఇది వేసవి కాలం.. ఈ సమయంలో ప్రజలు ఈత కొలనులో స్నానానికి ఎక్కువగా వెళతారు. పిల్లల నుండి పెద్దల వరకు అందరూ కొలనులో స్నానం చేసేందుకు ఆనందిస్తారు. కానీ ఈ మండే వేడి, ఎండలో స్నానం చేసేటప్పుడు. స్నానం చేసిన తర్వాత చాలా విషయాలు గుర్తుంచుకోవాలి. శుభ్రమైన కొలనుల్లోనే స్నానం చేయాలని వైద్యులు చెబుతున్నారు. పూల్ నీరు కొద్దిగా మురికిగా ఉంటే, ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంటుందంటున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఈ ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. సూర్యరశ్మి ఎక్కువగా ఉన్న సమయంలో స్నానం చేసిన తర్వాత ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఇలా చేయకపోతే వారి ఆరోగ్యం పాడవుతుందంటున్నారు. స్విమ్మింగ్ పూల్ లో స్నానం చేసే ముందు శరీరాన్ని హైడ్రేషన్ లో ఉంచుకోవడం ముఖ్యం. దీని కోసం ఖచ్చితంగా తగినంత నీరు తాగాలి. స్నానం చేసేటప్పుడు పూల్ నీటిని మింగవద్దు. ఇలా చేయడం వల్ల కడుపు సంబంధిత వ్యాధులు వస్తాయి. ఎందుకంటే పూల్ నీటిలో క్లోరిన్ ఉంటుంది. దీన్ని తాగితే కడుపులో ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. బయట సూర్యకాంతి లేదా వేడి వాతావరణం కారణంగా ఎప్పుడూ నేరుగా కొలనులోకి వెళ్లి స్నానం చేయవద్దు. ఎందుకంటే ఇది శరీర ఉష్ణోగ్రతను ప్రభావితం చేస్తుంది. కొలనులో స్నానానికి ముందు కాసేపు నడవడానికి ప్రయత్నించండి. కొలనులో మీ కాళ్ళతో కొంత సమయం పాటు కూర్చోండి. ఇది మీ శరీర ఉష్ణోగ్రతను పూల్ నీటి స్థాయికి తీసుకువస్తుంది. దీని వల్ల స్నానం చేసే సమయంలో లేదా తర్వాత ఎలాంటి ఇబ్బంది ఉండదు. కొంతమంది కొలనులో చాలా గంటలు స్నానం చేస్తుంటారు. ఇలా చేయడం ద్వారా ఈ కాలంలో శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. కానీ కొలను బహిరంగ ప్రదేశంలో సూర్యరశ్మి కూడా పైన పడుతుంటుంది. ఒక వ్యక్తి స్నానం చేసిన తర్వాత ఎక్కువసేపు ఎండలో నిలబడితే, అది ఉష్ణోగ్రతలో ఆకస్మిక పెరుగుదలకు కారణమవుతుంది. ఇది డీహైడ్రేషన్ లేదా హీట్ స్ట్రోక్‌కి కారణమవుతుంది. అందుకే ఇండోర్ ఈత కొలనులకు వెళ్లడానికి ప్రయత్నించండి. మీరు ఓపెన్ ఎయిర్ పూల్‌కు వెళుతున్నట్లయితే, ఎక్కువసేపు స్నానం చేయకండి. స్నానం చేసిన తర్వాత వెంటనే నీడలోకి వెళ్లాలని నిపుణులు చెబుతున్నారు.

# కొబ్బరికాయకు మూడు కళ్ళు ఎందుకు?



హిందూ మతంలో కొబ్బరి చాలా ముఖ్యమైనది, పవిత్రమైనదిగా పరిగణిస్తారు. కొబ్బరిని క్వీన్స్ అని కూడా అంటారు. అన్ని రకాల పూజలు, శుభకార్యాలలో కొబ్బరికాయను ఖచ్చితంగా ఉపయోగిస్తారు. ఏదైనా శుభకార్యం, కొత్త ఇల్లు, దుకాణం లేదా కొత్త వాహనం వచ్చిన తర్వాత కూడా కొబ్బరికాయను కొట్టే సంప్రదాయం ఉంది. కొబ్బరికాయలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు అనే ముగ్గురు దేవుళ్లు నివసిస్తారు అని నమ్ముతారు. కొబ్బరి నీళ్లను ఇంట్లో చల్లడం వల్ల ప్రతికూల శక్తులన్నీ నశిస్తాయనే నమ్మకం ఉంది. అలాగే కొబ్బరికాయ పై ఉండే మూడు గుండ్రని గుర్తులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు సంబంధించినవిగా ప్రజలు భావిస్తారు. కొబ్బరికాయ లేదా క్వీన్స్ గురించి ఒక నమ్మకం కూడా ఉంది. ఒకసారి విష్ణువు తల్లి లక్ష్మితో కలిసి భూమిపైకి వచ్చాడట. అప్పుడు తల్లి లక్ష్మి కూడా తనతో పాటు కామధేను ఆవు, కొబ్బరి చెట్టును భూమికి తీసుకువచ్చిందని చెబుతారు. మరొక కథనం ప్రకారం భూమిపై పురాతన కాలంలో మానవులను, జంతువులను బలి ఇచ్చే ఆచారం ఉందట. ఈ బలిదానాన్ని ఆపడానికి కొబ్బరికాయను ఉపయోగించడం ప్రారంభించారని పురాణాలు చెబుతున్నాయి. ఎందుకంటే కొబ్బరికాయను మానవునిలా భావిస్తారు. కొబ్బరికాయ మనిషి పుర్రె లాంటిది, దాని జుట్టు మనిషి వెంట్రుకలా ఉంటుంది. ఈ కారణంగా, జంతువులను లేదా మానవులను బలి ఇవ్వడానికి బదులుగా కొబ్బరికాయను కొట్టడం ప్రారంభించారని చెబుతారు. పురాణాల ప్రకారం ప్రాచీన కాలంలో సత్యవ్రత అనే రాజు పరిపాలించేవాడు. మహర్షి విశ్వామిత్ర రాజు సత్యవ్రత రాజ్యంలో నివసించారు. ఒకసారి మహర్షి విశ్వామిత్రుడు తపస్సు చేయడానికి ఇంటికి దూరంగా వెళ్ళాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో అతని కుటుంబం ఆకలితో, దాహంతో అడవిలో తిరగడం మొదలుపెట్టింది. రాజు సత్యవ్రత్ మహర్షి విశ్వామిత్ర కుటుంబాన్ని గమనించినప్పుడు, అతను తన కుటుంబాన్ని తనతో పాటు తన ఆస్థానానికి తీసుకువచ్చి వారికి బాగా సేవ చేశాడు. విశ్వామిత్రుడు తిరిగి వచ్చినప్పుడు, అతని కుటుంబ సభ్యులు రాజు చేసిన సేవ గురించి చెప్పారు. అప్పుడు మహర్షి విశ్వామిత్రుడు రాజు ఆస్థానానికి చేరుకుని రాజుకు కృతజ్ఞతలు తెలిపాడు. అప్పుడు రాజు కృతజ్ఞత స్థానంలో తనకు ఒక వరం ఇవ్వమని అభ్యర్థించాడు. మహర్షి విశ్వామిత్రుడు రాజుకు అనుమతి ఇచ్చాడు. అప్పుడు రాజు తాను జీవించి ఉండగానే స్వర్గానికి వెళ్లాలనుకుంటున్నానని మహర్షితో చెప్పాడు. దీని పై విశ్వామిత్ర మహర్షి, తన తపస్సు శక్తి ద్వారా, నేరుగా స్వర్గానికి దారితీసే మార్గాన్ని సిద్ధం చేశాడు. ఆ మార్గంలో సత్యవ్రత్ రాజు స్వర్గానికి చేరుకున్నప్పుడు, స్వర్గపు రాజు ఇంద్రుడు అతన్ని క్రిందికి నెట్టాడు. అతను భూమిపై పడగానే, రాజు విశ్వామిత్ర మహర్షికి ఈ సంఘటన మొత్తాన్ని చెప్పాడు. అది విన్న విశ్వామిత్ర మహర్షికి కోపం వచ్చింది. అప్పుడు మహర్షి విశ్వామిత్రుని కోపం నుండి తనను తాను రక్షించుకోవడానికి, దేవతలు అతనితో మాట్లాడటానికి వచ్చారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొన్నారు. దీనికి పరిష్కారంగా భూమికి, స్వర్గానికి మధ్య మరో స్వర్గాన్ని నిర్మించాలని నిర్ణయించారు. అది స్వర్గంగా మారినప్పుడు, అది ఒక స్తంభంతో భూమికి అనుసంధానించి ఉంటుంది. ఆ తర్వాత ఆ స్తంభం కొబ్బరి చెట్టు కొమ్మగా మారిందని, రాజు తల కొబ్బరికాయగా మారిందని ప్రతీతి. ఈ కారణంగా కొబ్బరికాయ ఆకారం మానవ పుర్రెను పోలి ఉంటుందని చెబుతారు.

# నిత్య జీవితంలో సైన్స్..





సూర్యుడు తూర్పునే ఎందుకు ఉదయిస్తాడు? చంద్రుడు ఎందుకని చల్లగా ఉంటాడు? అనే అనుమానం మీకెప్పుడైనా వచ్చిందా? పీరియడ్ టైమ్‌లో స్త్రీలను ముట్టుకోవద్దని, వారు ఇంట్లోకి వస్తే దరిద్రం చుట్టుకుంటుందనే మాటలు బాధించాయా? నిత్య జీవితంలో ఎదురయ్యే ఇటువంటి సందేహాలకు, మూఢ నమ్మకాలకు చెంప పెట్టులాంటి చక్కటి సమాధానం చెప్పింది సైన్స్. మహిళల బెస్ట్ ఫ్రెండ్ అని కూడా 'సైన్స్'ను అభివర్ణిస్తుంటారు నిపుణులు. ఎందుకంటే సమాజంలో వారు ఎదుర్కొనే ఎన్నో ఇబ్బందుల నుంచి బయటపడేసింది. లింగ వివక్షను తిప్పి కొట్టింది. ఆత్మ గౌరవాన్ని నిలబెట్టింది. సైన్స్ అండ్ టెక్నాలజీ తెచ్చిన మార్పులతో నేడు మహిళల జీవితం సులభతరమైంది. అదెలాగో తెలుసుకుందాం.

## మహిళలు - సంతానం

నేటి ఆధునిక సమాజం అనేక మూఢ నమ్మకాలను అనుభవిస్తూ, దాటుకుంటూ వచ్చింది. ముఖ్యంగా సంతానం కలిగినప్పుడు ఆడ పిల్ల లేదా మగ పిల్లలు పుట్టడానికి స్త్రీలు మాత్రమే కారణం అనే మూఢనమ్మకం ఉండేది ఒకప్పుడు. ఇప్పటికీ కొందరు ఆడశిశువు పుట్టిందని మహిళలను వేధించే సంఘటనలు అక్కడక్కడా జరుగుతున్నాయి. కానీ ఈ విషయంలో సైన్స్ తిరుగులని ఆన్సర్ ఇచ్చింది. ఆడ, మగ పిల్లలు పుట్టడానికి కారణం కేవలం మహిళే కారణమనే మూఢత్వాన్ని తిప్పి కొట్టింది. స్త్రీ, పురుషుల కలయిక, పురుషుడి స్పెర్మ్‌లోని క్రోమోజోములే పుట్టబోయే బిడ్డ ఆడ లేదా మగ అనేది నిర్ణయిస్తాయని విడమర్చి చెప్పింది. లింగ నిర్ధారణలో క్రోమోజోములే కీలకమని నిరూపించడంతో సమాజంలో మహిళలపై ఉన్న అపోహలు, అనుమానాలు తొలగేందుకు కారణమైంది సైన్స్. వివక్ష నుంచి విముక్తి సైన్స్ లేకపోతే సమాజంలో ఇప్పటికీ మహిళలపట్ల వివక్ష తీవ్రస్థాయిలో ఉండేది. అలా చేయడం తప్పు అని చెప్పడానికి ఎవరూ సాహసించేవారు కాదేమో. కానీ ఆ పనిలేకుండా చేసేసింది సైన్స్. సొసైటీలో వివక్షను ఎదుర్కొంటున్న మహిళలకు జ్ఞానమనే గొప్ప ఆయుధాన్నిచ్చిందని సైన్స్. కట్టుబాట్లు, సంప్రదాయాల పేరుతో, పుక్కిటి పురాణాలు, మతపరమైన ఆచారాలు, మూఢత్వాలతో కొనసాగే వివక్ష, అణిచివేతలను కూడా ప్రశ్నించేలా చేసింది సైన్స్ మాత్రమే. సమజాంలో తప్పులు, అన్యాయాలను మహిళలకు ఆపాదించే అనేక అంశాలను వ్యతిరేకించింది. పురుషులతో సమానంగా అన్ని విషయాల్లోనూ స్త్రీలకు స్వేచ్ఛ ఉందని, ఇవ్వాలని చాటి చెప్పింది.

## రుతుస్రావం - పవిత్రత

రుతు స్రావం అనేది మహిళల్లో సహజమైన శారీరక ధర్మం. కానీ ఈ సమాజం ఒకప్పుడు అలా చూసేది కాదు, పీరియడ్ అనేది ఏదో భయంకరమైన విషయంగా, నెలసరి వచ్చిన మహిళలను దెయ్యాలుగా, అపవిత్రులుగా చూసేవారు. బహిష్టు సమయంలో యువతులు ఇండ్లల్లోకి, గుళ్లల్లోకి రావ్దని, చదువుకోవద్దని, ఎవరినీ ముట్టుకోవద్దని, రజస్వల తర్వాత పురుషులు చెప్పింది వినాలని ఇలా.. రకరకాల పుక్కిటి పురాణాలు సంప్రదాయంలో వేళ్లూనుకుని ఉండేవి. మహిళలను వెలివేయడానికి, ఒంటరి చేయడానికి, మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెట్టడానికి ఈ మూఢ నమ్మకాలు తోడ్పడ్డాయి. కానీ సైన్స్ డెవలప్ అయ్యాక వాటిని వ్యతిరేకించింది. సంప్రదాయాల మాటున జరిగే అన్యాయలను ప్రశ్నించింది. మహిళలకు అండగా నిలిచింది.

## శ్రమలో సౌకర్యం

సైన్స్ వల్లే కాలక్రమంలో టెక్నాలజీ డెవలప్ అయింది. ఇది మహిళల శ్రమదోపిడీని లేదా శ్రమలో అసౌకర్యాన్ని అరికట్టింది. ముఖ్యంగా వాషింగ్ మెషిన్ అందుబాటులోకి రావడంవల్ల మహిళలకు గొప్ప ఉపశమనం లభించినట్లయింది. ఇది రాకముందు అన్ని ఇంటిపనులతో సహా బట్టలు ఉతకడం కూడా స్త్రీలే చేసేవారు. వాషింగ్ మెషిన్ వచ్చిన తర్వాత బట్టలు ఉతకడంలో సౌకర్యం ఏర్పడింది. కష్టం తప్పింది. అందరికీ అందుబాటులో వాషింగ్ మెషిన్ ఉంటుందా? లేదా అనేది పక్కన పెడితే ఈ మార్పును ఉమెన్ ఫ్రెండ్లీగానే చెప్పవచ్చు. ఎందుకంటే మహిళలపై పని భారం తగ్గించింది. ఒత్తిడిని దూరం చేసింది.

# మనిషికి సంపూర్ణ నిద్ర ఎన్నిగంటలు?



గొప్ప వ్యక్తులు జీవితంలో గొప్ప విషయాలను గురించి చెబుతుంటారు. వీటిలో మొదటిది ఆరోగ్యకరమైన శరీరం, రెండవది మంచి నిద్ర. కానీ నేటి కాలంలో మంచి నిద్ర పొందడం పెద్ద సమస్యగా మారింది. చెడు జీవనశైలి, ఫోన్ వాడకం, మాదకద్రవ్యాలు తీసుకోవడం మంచి నిద్రను రానివ్వవు. నిద్రలేమి కూడా అనేక వ్యాధులకు కారణమవుతోంది. దీనివల్ల ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు, మానసిక ఆరోగ్యం క్షీణించి ప్రజలు బాధితులుగా మారుతున్నారు. సోషల్ మీడియా యుగంలో నిద్రలేమి ఒక వ్యాధిగా మారుతోంది. ఈ సమస్య నుంచి బయటపడేందుకు ప్రజలు మందులు వేసుకుంటున్నారు. మరికొంతమంది సంవత్సరాలుగా చికిత్స తీసుకుంటారు. అయితే మంచి నిద్ర అంటే ఏమిటి, ఎన్ని గంటలు ఉండాలి, మంచి నిద్ర ఎలా పొందవచ్చు. ఇలాంటి అనేక ప్రశ్నలు చాలా మందికి వస్తుంటాయి. మరి ఆ సందేహాలకు సమాధానాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. అమెరికన్ అకాడమీ ఆఫ్ స్లీప్ మెడిసిన్ ప్రకారం ఒక వ్యక్తి రోజుకు కనీసం 8 గంటలు నిద్రపోవాలి. చాలా మంది చాలా గంటలు నిద్రించడానికి ప్రయత్నిస్తారు. కానీ ప్రతి ఒక్కరు అంతగా నిద్రపోరు. చాలా మంది వ్యక్తులు కేవలం 4 గంటలు మాత్రమే నిద్రపోతారు. కేవలం ఈ కాస్త సమయంలోనే తమ నిద్రను పూర్తి చేస్తారు. అసలు అది ఎలా సాధ్యం, మరి 8 గంటలు నిద్రపోయే వారికి, 4 గంటలు నిద్రపోయేవారి మధ్య తేడా ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. నిద్రపోయే గంటలు కాకుండా నిద్ర నాణ్యత ముఖ్యమని వైద్యనిపుణులు చెబుతున్నారు. చాలా వరకు పరిశోధనలు ఏడెనిమిది గంటల నిద్ర ఉత్తమమని చెబుతున్నాయి. అయితే ఇది నిజంగా వ్యక్తి పై ఆధారపడి ఉంటుంది. కొంతమంది వ్యక్తులు రాత్రుళ్లు 8 లేదా అంతకంటే తక్కువ గంటలు నిద్రపోతారు. కానీ వారు పూర్తిగా రిఫ్రెష్‌గా ఉంటారు. మరికొందరికి విశ్రాంతి తీసుకోవడానికి 8 గంటల కంటే ఎక్కువ సమయం పడుతుంది. అయినా వారి నిద్ర పూర్తికాక డ్రౌసీగా ఉంటారు. మరి కొంతమంది కేవలం 4 గంటల్లోనే నిద్రను పూర్తి చేసుకుంటారు. అయితే విశ్రాంతి తీసుకునే వ్యక్తి ఎంత సేపు గాఢ నిద్ర నిద్రపోతాడనే దాని పై ఆధారపడి ఉంటుంది. ఎక్కువ సమయం గాఢంగా నిద్రపోయేవారు 4 గంటల పాటు నిద్రిస్తే సరిపోతుందంటున్నారు నిపుణులు. వారిని డీప్ స్లీపర్స్ అంటారు. అలాంటి వ్యక్తులు తక్కువ నిద్రపోయిన తర్వాత కూడా ఎటువంటి అనారోగ్య సమస్యలను ఎదుర్కోరు. అయితే తేలికగా నిద్రపోయే వారు 7 నుండి 8 గంటల పాటు నిద్రపోయిన తర్వాత కూడా అసంపూర్ణమైన నిద్రను అనుభవిస్తారు. వీటిని లైట్ స్లీపర్స్ అంటారు.

# ఆ సమస్య ఉన్నవారు దానిమ్మ పండు ప్రమాదమే!



చూడగానే ఎర్రగా నోరూరించే పండు దానిమ్మ. ఈ పండుని తినడానికి అందరు ఇష్టపడతారు. దానిమ్మ పండును తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. ఐరన్ లోపంతో బాధపడేవారు దీన్ని ప్రతి రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో రక్త లోపం ఉండదు. ప్రతిరోజు దానిమ్మ పండును తీసుకోవడం వల్ల శరీరంలో ఎనర్జీ మెయింటైన్ అవుతుంది. దానిమ్మ పండును తినడం వల్ల అనేక ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అయితే అందరికీ ప్రతిరోజు దానిమ్మ పండును తినడం హానికరమని చెప్పబడింది. ఈ క్రమంలో ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారంటే అటువంటి సమస్యలు ఉన్నవారు దానిమ్మ పండుని ఎక్కువ మోతాదులో తీసుకోవద్దు అంటున్నారు. దానిమ్మ పండును అలర్జీ సమస్యలతో బాధపడేవారు తినకుండా ఉంటే మంచిదని చెబుతున్నారు. ఎందుకంటే అలర్జీలతో బాధపడేవారు దానిమ్మ పండ్లు తింటే శరీరంలో రక్తాన్ని పెంచడం వల్ల మరింత ఎక్కువగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. దీంతో ఎర్రటి దద్దుర్లు వచ్చే అవకాశం ఉందంటున్నారు. దానిమ్మ శీతలీకరణ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి రక్త ప్రసరణ మందగించే అవకాశం ఉంటుంది. అందుకే తక్కువ రక్తపోటు ఉన్నవారు దానిమ్మ పండ్లు తినకూడదని సలహా ఇస్తున్నారు. హై బీపీ ఉన్నవారికి దానిమ్మ పండ్లు తినడం మేలు చేస్తుంది కానీ, లో బీపీ ఉన్నవారు దానిమ్మ పండ్లు తింటే హాని కలిగిస్తోందంట. దానిమ్మ పండ్లు తినాలి అనుకునేవారు ఎసిడిటీ సమస్యతో బాధపడితే దానిమ్మ పండును తినకుండా ఉంటేనే మంచిదని సూచిస్తున్నారు. దానిమ్మలో ఉండే ఆమ్లత్వ లక్షణాలు ఎసిడిటీని మరింత పెంచి అనారోగ్యాన్ని కలిగిస్తుంది. మలబద్ధకంతో బాధ పడేవారు ఈ పండ్లు ప్రతిరోజు తినడం మంచిది కాదు. తింటే వారి సమస్య మరింత తీవ్రతరమవుతుంది. ఇన్ఫ్లుఎంజా సమస్యతో లేదా దగ్గుతో బాధపడేవారు వీటిని తినకూడదు. ఇది ఇన్ఫెక్షన్‌ను మరింత పెంచుతుంది. కాబట్టి పైన పేర్కొన్న అనారోగ్య సమస్యలు ఉన్నవారు దానిమ్మ పండ్లు తినకుండా ఉండాలని సలహా ఇవ్వబడింది. ఈ కథనం వైద్య నిపుణుల సూచనలు మరియు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న అంశాల ఆధారంగా రూపొందించబడింది. దీనిని 'దిశ' ధృవీకరించలేదు.

# భర్త ఇలా చేస్తే భార్యకు నార్మల్ డెలవరీ ఖాయం..



మాతృత్వం గొప్పతనం మాటల్లో చెప్పలేనిది. అమ్మ, నాన్నలము కాబోతున్నాం అనే ఆ ఫీలింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇక తమకు పుట్టబోయే బిడ్డ కోసం ఆ కపుల్స్ ఎన్నో కలలు కంటారు. అంతే కాకుండా తమ భార్య చాలా ఆరోగ్యంగా ఉండి, ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వాలని ప్రతి భర్త కోరుకుంటాడు. అయితే ఇప్పుడున్న మహిళలు చాలా మంది సీజెరియన్ అంటే భయపడుతున్నారు. ఆ తర్వాత వచ్చే గర్భాశయ ప్రాబ్లమ్స్, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సీ సెక్షన్‌కు నో చెబుతున్నారు. నార్మల్ డెలవరీ కోసం చాలా ట్రై చేస్తున్నారు. అంతే కాకుండా చెకప్ టైమ్‌లో కూడా డాక్టర్స్‌ను నార్మల్ డెలవరీ టిప్స్ చెప్పని అడుగుతుంటారు. ఎలాంటి టిప్స్ పాటిస్తే నార్మల్ డెలవరీ అవుద్ది? ఎన్నో నెల నుంచి నార్మల్ డెలవరీ కోసం చిట్కాలు పాటించాలి. ఎలాంటి ఫుడ్ తీసుకోవాలి. ఇలా చాలా రకాలుగా వారికి వారే ప్రశ్నలు వేసుకుంటారు. అయితే తన భార్యకు నార్మల్ డెలవరీ కావాలంటే భర్త పక్కన ఉండి తప్పకుండా ఇలాంటి టిప్స్ ఫాలో కావాలి అంట. అవి ఏంటో ఇప్పుడు చూద్దాం. భర్త తన పేరెంట్స్ ఉన్నారుగా అని లైట్ తీసుకోకుండా తన భార్యకు ఎప్పుడూ దగ్గరిగా ఉండాలంట. ప్రతి విషయాన్ని ఆమెతో షేర్ చేసుకుంటూ.. తనను హాప్పీగా ఉంచాలి. చాలా మంది ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు అనారోగ్య సమస్యల బారిన పడుతుంటారు. కొందరికి ఫుడ్ తినాలనిపించదు. కాళ్ల వాపులు లాంటి సమస్యలు ఎదురవుతాయి. అయితే ఆ సమయంలో భర్త పక్కనే ఉండి మసాజ్ చేయడం, ఇష్టమైన ఫుడ్ వండిపెట్టడం. సమయానికి మంచి మంచి ఫ్రూట్స్ అందించడం లాంటిది చేయాలంట. గర్భంతో ఉన్న సమయంలో ఆ మహిళ ఎక్కువగా ఇంట్లోనే గడుపుతుంది. దీంతో అది ఆమెకు ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవచ్చు. అందువలన ఏదైనా మంచి ప్రదేశానికి తీసుకెళ్లడం చేయాలి. పచ్చటి గాలి, ప్రకృతి లాంటి దగ్గరకు తీసుకెళ్లడం ద్వారా ఆమె మైండ్ రిలీఫ్ అవుద్దీ. అలాగే మీరు మీ బిడ్డతో మాట్లాడటం, బేబీ బంప్‌పై చేయి పెట్టి తన కదలికలు గమనిస్తూ ఉండటం కూడా చేయాలంట. దీని ద్వారా బాండింగ్ పెరుగుతుంది.

# గోళ్లకు కూడా మసాజ్ అవసరమే..



ఈమధ్య కాలంలో గోళ్లు పెంచడం ఫ్యాషన్ గా మారిపోయింది. ఒకప్పుడు అమ్మాయిలు మాత్రమే గోళ్లు పెంచే వారు. వాటికి నెయిల్ పాలిష్, ప్రత్యేక రంగులతో అలంకరించే వారు. కానీ ఇప్పుడు పురుషులు కూడా స్త్రీలకు సమానంగా గోళ్లు పెంచుతున్నారు. అయితే గోళ్లకు కూడా మసాజ్ చేయడం అవసరం అంటున్నారు వైద్య నిపుణులు. గోళ్లు పెంచే క్రమంలో కొన్ని పనులకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. పైగా గోళ్లు పెరిగేందుకు కొన్ని ప్రత్యేకమైన లేపనాలు కూడా వాడాలని సూచిస్తున్నారు. చేతికి ఉన్న గోళ్లు పెరగాలంటే వాటిని ఎక్కువగా నీటిలో తడవనీయకూడదు. ఎప్పటికప్పుడు చేతిని పొడిగా ఉంచేకోవాలి. గోళ్లలో తేమ లేకుండా, మట్టి లేకుండా శుభ్రపరుచుకోవాలి. క్రమంగా ఒక షేప్ లో కత్తిరిస్తూ ఉండటం వల్ల సరిగా పెరుగుతాయి. అలాగే గోళ్లు పెరగేందుకు మాయిశ్చరైజర్ లాంటి లోషన్లు ప్రతి రోజు పూస్తూ ఉండాలని చెబుతున్నారు డాక్టర్లు. అప్పుడే అవి మృదువుగా, బలంగా పెరుతాయని సూచిస్తున్నారు. అలాగే బాగా గోళ్లను పెంచిన వారు బిగుతుగా ఉన్న డబ్బాల మూతలు తీయడానికి గోళ్లను ఉపయోగించకూడదు. ఇలా చేయడం వల్ల ఒత్తిడికి గురై గోళ్లు విరిగిపోయే ప్రమాదం ఉంది. లేదా పూర్తిగా గోరు ఊడిపోయి తీవ్రమైన రక్తస్రావం జరిగి ఇబ్బందులు ఎదుర్కొంటారు. వాటిని పెంచేటప్పుడు నిర్వహణ కూడా ప్రధానం అని చెబుతున్నారు.

# వీరికి సంజీవని ఈ పండు..



రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. వాటిలో ఒకటి పండ్లు తినడం. కొన్ని పండ్లను తీసుకోవడం వల్ల సహజంగా మీ శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. అలాంటి వాటిలో అవకాడో ఒకటి. దీనిని బటర్ ఫ్రూట్ అని కూడా పిలుస్తారు. ఈ పండు మన శరీరానికి చాలా పోషకాలను అందిస్తుంది. అవకాడోలో కూరగాయల మాదిరిగానే ఆరోగ్యకరమైన పదార్థాలు ఉంటాయి. ఇందులో కొవ్వు అధికంగా ఉన్నప్పటికీ, ఇది మీ శరీరాన్ని అదనపు కొవ్వు నుండి రక్షిస్తుంది. మీ శరీరం ఫోలిక్ యాసిడ్ వంటి విటమిన్లను ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. కాబట్టి మీరు ఈ పండును పచ్చిగా తినవచ్చు. అవకాడో మీ శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడానికి సహాయపడుతుంది. ఇది కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను కూడా నియంత్రణలో ఉంచుతుంది. అవకాడోను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల స్ట్రోక్ లేదా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అవకాడోలో ఉండే కొవ్వు ఆమ్లాలు, లైపేస్ ఎంజైమ్ శరీరంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. అవకాడోలో విటమిన్ బి, విటమిన్ కె, విటమిన్ ఇ, విటమిన్ సి పుష్కలంగా ఉన్నాయి. అవకాడోలో ఉండే పొటాషియం మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. మీ రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అవకాడోలో ఉండే ఫైబర్ మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.

# బుజ్జాయి కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే..



మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలలో కన్ను ఒకటి. చూపు లేని లోకం అంధకారం అని పెద్దలు అందుకే అంటారు. కాబట్టి కంటి సంరక్షణ చాలా ముఖ్యం. ముఖ్యంగా నేటి డిజిటల్ యుగంలో పిల్లలు చిన్నప్పటి నుంచే ఫోన్ స్క్రీన్‌కు అలవాటు పడుతున్నారు. దీంతో పిల్లల కళ్ళు బాల్యం దశలోనే ప్రమాదంలో పడుతున్నాయి. కాబట్టి చిన్న వయసు నుంచే పిల్లల కళ్లకు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే వయసు పెరిగే కొద్దీ సమస్యలు మరింత తీవ్రతరం అవుతాయి. మీ కంటిపాప చూపును జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం ఆయుర్వేదాన్ని ఆశ్రయించవచ్చు. మంచి కంటి చూపుకు, కంటి సంరక్షణకు ఆయుర్వేద నివారణలు ఎంతో ఉపయోగపడతాయి. తర్పన్ అనేది ఒక రకమైన ఆయుర్వేద చికిత్స. ఇది కళ్ళను తేమగా ఉంచడానికి, దృష్టిని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇది కంటి దురదను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. దీనిని ఎలా వినియోగించాలంటే.. నెయ్యిని కళ్లపై నెమ్మదిగా రాసి, ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కళ్లను కడగాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల కళ్లకు చాలా మంచిది. కళ్లలోకి చేరే రకరకాల దుమ్ము, కాలుష్య కారకాలను తొలగించి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. అయితే అధిక వేడి, చల్లటి నెయ్యిన కళ్లకు ఎప్పుడూ పూయకూడదు. అలాగే కళ్లపై ప్రత్యక్ష సూర్యకాంతి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల కళ్లలోకి యువి కిరణాలు నేరుగా పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సూర్యుడి నుండి కళ్ళను రక్షించడం కూడా అవసరమే. నేటి యుగంలో పిల్లల ముందు టీవీ, ల్యాప్‌టాప్, మొబైల్ స్క్రీన్‌లు కనిపిస్తున్నాయి. వాటిని నివారించలేం. అయితే పిల్లలను స్క్రీన్‌కు దూరం ఉంచడం మీ చేతుల్లో పనే. ఇది మీ పాపాయి కళ్లను కొంత వరకు కాపాడుతుంది. ఆయుర్వేదం ప్రకారం సోంపు గింజలు తినడం కళ్ళకు ఎంతో మేలు జరుగుతుంది. సోంపు గింజలు నోటి దుర్వాసనను తొలగించడంలో కూడా ఉపయోగపడతాయి.

# జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారా?



ఏడాది పొడవునా మార్కెట్‌లో లభించే పండ్లలో ఖర్జూరం ఒకటి. వివిధ రకాల ఖర్జూరాలు మార్కెట్లో లభిస్తుంటాయి. అన్ని రకాల ఖర్జూరాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే వీటిని 'సూపర్ ఫుడ్' అని కూడా పిలుస్తారు. ప్రతిరోజూ ఖర్జూరం తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. రోజూ ఖర్జూరం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇక్కడ తెలుసుకుందాం.. ఖర్జూరంలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇందులో మెగ్నీషియం, పొటాషియం, కాపర్, మాంగనీస్, విటమిన్ బి6, కె అధికంగా ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే ఖర్జూరంలో పోషక విలువలు చాలా ఎక్కువ. ఖర్జూరం తినడం వల్ల ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి చక్కెరలు శరీరంలోకి ప్రవేశిస్తాయి. శరీరానికి వెంటనే శక్తి అందుతుంది. అందుకే ఉపవాసం తర్వాత ఖర్జూరం తినడం మంచిది. ఖర్జూరం పొట్టకు చాలా మంచిది. ఖర్జూరాలు జీర్ణక్రియలో సహాయపడతాయి. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. పీచు పుష్కలంగా ఉండటం వల్ల మలబద్ధకం నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. ఖర్జూరం గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఖర్జూరాలు హృదయనాళ వ్యవస్థకు చాలా మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే శక్తి కూడా ఖర్జూరాలకు అధికంగా ఉంటుంది. ఖర్జూరంలో చక్కెర ఉన్నప్పటికీ ఇవి రక్తంలో చక్కెరను పెంచవు. అయినప్పటికీ డయాబెడిస్ పేషెంట్లు వీటిని తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. ఖర్జూరాలు మెదడు ఆరోగ్యాన్ని పెంచడానికి, మెదడు పనితీరును పెంచడంలో సహాయపడతాయి.

# ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి

**-ప్రతి బస్‌స్టాప్‌లో బస్సులు ఆపాలి**
**-ఐద్వా విశాఖ జిల్లా కమిటీ డిమాండ్**



విశాఖపట్నం, చైతన్యవారధి: మహిళల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచడంతోపాటు ప్రతి బస్‌స్టాప్‌లో బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని ఐద్వా విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఆర్.ఎన్. మాధవి, కార్యదర్శి వై. సత్యవతి, జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. సుమిత్ర, ఆర్. వరలక్ష్మి విశాఖ ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ బి. అప్పలనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు మాట్లాడుతూ, మహిళల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే, పథకం అమలులో తగిన ఏర్పాట్లు లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో బస్సుల సంఖ్య తగ్గిపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు, బస్సులు బస్‌స్టాప్‌లలో ఆగకుండా వెళ్లిపోతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు బస్సులు ఎక్కేందుకు ప్రయత్నించినప్పుడు కొన్ని సందర్భాల్లో బస్సులు ఆగకుండా వెళ్లిపోతున్నాయని ఆరోపించారు. బస్సుల సంఖ్య తగ్గడం వల్ల ఆర్టీసీ సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోందని, ఈ పరిస్థితులు మహిళలు, సిబ్బంది మధ్య అనవసర ఘర్షణలకు దారితీస్తున్నాయని అన్నారు. సమయానికి ఉద్యోగాలకు, కళాశాలలకు చేరుకోలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మహిళల సంక్షేమం గురించి ప్రకటనలు చేయడమే కాకుండా, ఆచరణలోనూ వారికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు అవసరమైన బస్సులు, సిబ్బంది, ఇతర సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

ఐద్వా ప్రధాన డిమాండ్లు...నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్యను తక్షణమే పెంచాలి. ప్రతి బస్‌స్టాప్‌లో బస్సులు తప్పనిసరిగా ఆగేలా కఠిన ఆదేశాలు జారీ చేయాలి. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులతో గౌరవంగా వ్యవహరించేలా స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాలి. ఉచిత బస్సు ప్రయాణ పథకం సక్రమ అమలుకు సమగ్ర ప్రణాళిక ప్రకటించాలి. ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది మధ్య ఘర్షణలకు దారితీసే పరిస్థితులను నివారించాలి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఐద్వా నాయకులు కోరారు. లేనిపక్షంలో మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# సమష్టి కృషితోనే డిగ్రీ కళాశాల భవన నిర్మాణం

**-నాణ్యతలో రాజీ పడకుండా ఏడాదిలోనే పూర్తి చేశాం -భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**



ఆనందపురం, చైతన్యవారధి: సమష్టి కృషితోనే ఆనందపురంలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణం సాధ్యమైందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా ఏడాది వ్యవధిలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేయగలిగామని తెలిపారు. నూతన కళాశాల భవనాన్ని ప్రారంభించిన అనంతరం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామని, భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణం, అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలను బోధించి, దేశానికి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థి దశలోనే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణ, అంకితభావంతో దానిని సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా...కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి మాట్లాడుతూ, ప్రధానమంత్రి ఉన్నత విద్యా అభియాన్ (పీఎం ఉషా) నిధులు వెనక్కి వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడిన సమయంలో గంటా శ్రీనివాసరావు జోక్యం చేసుకుని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని సమకూర్చారని తెలిపారు. ఆయన చొరవతో కళాశాల భవన నిర్మాణం సాకారమైందని, తద్వారా ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా లభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త చంద్రశేఖర్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, తాట్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, కసిరెడ్డి దామోదరరావు, గంటా నూకరాజు, బమ్మిడి ఉమ, డి.ఎ.ఎన్. రాజు, శివాజీ, బోని ప్రసాద్, రామరాజు, ఎర్ర రాజు, ఎల్.వి. రమణ, శ్రీను, గరే సదానంద, కాకర రమణ, నాగోతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు విజన్‌తో మిగులు విద్యుత్తు సాధ్యం

**-సౌర విద్యుత్ వినియోగంలో భీమిలిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలి**



ఆనందపురం, చైతన్యవారధి: విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను మిగులు విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రంగా అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రధానమంత్రి సూర్య ఘర్ సేవా సేతు అభియాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సౌర విద్యుత్ ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూర్య ఘర్ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. రాష్ట్రంలోనే అతిపెద్ద అసెంబ్లీ నియోజకవర్గమైన భీమిలిని సౌర విద్యుత్ ఉత్పత్తిలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని సూచించారు. కర్బన ఉద్గారాలను సున్నా స్థాయికి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వ కార్యాలయాలపై సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని ప్రజలంతా తమ ఇళ్లపై సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతోపాటు సూర్య ఘర్ పథకం ప్రయోజనాలను పొందాలని కోరారు. తక్కువ విద్యుత్ సరఫరా నష్టాలతో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) దేశంలోనే అత్యుత్తమ సంస్థగా నిలిచిందని గంటా శ్రీనివాసరావు ప్రశంసించారు. అంతకుముందు ఆయన సౌర విద్యుత్‌కు సంబంధించిన ప్రదర్శన శాలలను సందర్శించి, సేవా సేతు అభియాన్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీరు సింహాద్రి నాయుడు, కార్యనిర్వాహక ఇంజినీరు పోలాకి శ్రీనివాస్, సహాయ విభాగ ఇంజినీర్లు రాజశేఖర్, కిరణ్ కుమార్, సాయి సుధాకర్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, సుభాష్ చంద్రబోస్, బి.ఆర్.బి. నాయుడు, కసిరెడ్డి దామోదరరావు, బమ్మిడి ఉమ, పాండ్రంగి అప్పలరాజు, అప్పల రాము తదితరులు పాల్గొన్నారు.

# బాలికల సంరక్షణపై లఘు చిత్రాల పోటీలు

**-లింగ నిర్ధారణ పరీక్షల నివారణ.. ఆడపిల్లల రక్షణే ప్రధాన ఇతివృత్తం**




విశాఖపట్నం, చైతన్యవారధి, అక్టోబర్ 8: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాలికల సంరక్షణ, ఆడపిల్లల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు లఘు చిత్రాల పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ పోటీల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. 'లింగ నిర్ధారణ ఎంపికను అరికడదాం-ఆడపిల్లలను కాపాడుదాం' అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ పోటీల్లో ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. బాలికల ప్రాధాన్యం, ఆడపిల్లల సంరక్షణ, లింగ వివక్ష నిర్మూలన వంటి అంశాలపై విద్యార్థులు లఘు చిత్రాలను రూపొందించారు. ఈ పోటీల్లో విశాఖపట్నంలోని ఇసుకతోట డాక్టర్ వి.ఎస్. కృష్ణ డిగ్రీ కళాశాల, ఓల్డ్ జైలు రోడ్డులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, భీమునిపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, డాక్టర్ బి. ఉమావతి, జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి (జాతీయ ఆరోగ్య మిషన్) శ్రీహరికృష్ణ, మహిళా శిశు అభివృద్ధి శాఖ జిల్లా బాలల పరిరక్షణ అధికారి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్, నోడల్ అధికారి డాక్టర్ మంజుల, డెమో అధికారి బి. నాగేశ్వరరావు, సహాయ మలేరియా అధికారి బి. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# సింహాచల శ్రీ స్వామివారిని దర్శించుకున్న సంగీత దర్శకుడు తమన్



సింహాచలం, చైతన్యవారధి: ప్రముఖ సినీ సంగీత దర్శకుడు, స్వరకర్త, సంగీత నిర్మాత ఎస్.ఎస్. తమన్ సింహాచలంలోని శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానానికి విచ్చేసిన తమన్‌కు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ముందుగా పవిత్రమైన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ వేద పండితులు వేద మంత్రోచ్ఛారణలతో తమన్‌కు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం దేవస్థానం అధికారులు శేషవస్త్రంతో ఆయనను సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

# విశాఖలో భారీగా మత్తు పదార్థాల పట్టివేత

**-ముగ్గురు నిందితుల అరెస్ట్.. హాష్ ఆయిల్, ఎండీఎంఏ స్వాధీనం**




విశాఖపట్నం, చైతన్యవారధి: విశాఖ నగరంలో మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు చేపట్టిన తనిఖీల్లో భారీగా మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పోలీసులు కేసు వివరాలను వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈస్ట్ పాయింట్ కాలనీ, చినవాల్తేరులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో క్రైమ్ నంబర్ 157/2026 కింద మాదకద్రవ్యాల నియంత్రణ చట్టంలోని సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. అరెస్టయిన వారిలో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం ఎర్రవరం గ్రామానికి చెందిన అద్దేపల్లి మధు (26), గాజువాక పెదగంట్యాడ బీసీ రోడ్డుకు చెందిన పట్నాల వెంకట శివప్రసాద్ (28), గాజువాక శ్రీనగర్ అఫీషియల్ కాలనీకి చెందిన తిప్పల విద్యాసాగర్ (31) ఉన్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు....మొదటి నిందితుడు అద్దేపల్లి మధు నుంచి ఒక కిలో హాష్ ఆయిల్, ఏపీ 40 ఎల్‌క్యూ 7743 నంబరు గల బాలెనో కారు, రూ.10 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండో నిందితుడు పట్నాల వెంకట శివప్రసాద్ నుంచి 20 గ్రాముల ఎండీఎంఏ, రూ.10 వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరిన్ని వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మీడియా సమావేశంలో ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి, త్రీటౌన్ సీఐ ఎల్. అప్పలనాయుడు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# హృదయాలను హత్తుకునే ప్రేమకథ 'ఇట్లు అర్జున'



**-వైజాగ్‌లో ఇల్లు కొనుక్కోవడమే నా కల**
**-చిత్ర విలేకరుల సమావేశంలో సంగీత దర్శకుడు ఎస్. థమన్ ఆసక్తికర వ్యాఖ్యలు**



విశాఖపట్నం, చైతన్యవారధి: హృదయాలను హత్తుకునే ప్రేమకథగా 'ఇట్లు అర్జున' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని చిత్ర బృందం వెల్లడించింది. నూతన నటుడు అనీష్ కృష్ణ కథానాయకుడిగా పరిచయమవుతున్న ఈ ప్రేమ, యాక్షన్ ప్రధాన చిత్రానికి మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు వెంకీ కుడుముల తొలిసారిగా నిర్మాతగా మారి 'వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్' పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మలయాళ నటి అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తుండగా, సంగీత దర్శకుడు ఎస్. థమన్ స్వరాలు సమకూరుస్తున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు మంచి స్పందన లభించిందని చిత్ర బృందం తెలిపింది. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలోని గీతం విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సందడి మధ్య చిత్రంలోని మరో పాటను విడుదల చేశారు. అంతకుముందు నగరంలోని నోవోటెల్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలను వెల్లడించారు.

సరికొత్త పాత్రలో నటించే అవకాశం.....కథానాయకుడు అనీష్ కృష్ణ మాట్లాడుతూ, తొలి చిత్రంలోనే మాటలు లేకుండా సైగలు, హావభావాలతో భావాలను వ్యక్తం చేసే గంభీరమైన పాత్రలో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని, సినిమాలోని పోరాట సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని తెలిపారు.

వైజాగ్‌లో స్థిరపడాలనేది నా కోరిక...సంగీత దర్శకుడు ఎస్. థమన్ మాట్లాడుతూ, గతంలో తాను సంగీతం అందించిన 'తొలిప్రేమ' చిత్రానికి ప్రేక్షకుల నుంచి అపూర్వ ఆదరణ లభించిందన్నారు. చాలా కాలం తర్వాత అంతటి స్వచ్ఛమైన, బలమైన ప్రేమకథ 'ఇట్లు అర్జున' రూపంలో తన ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. సరికొత్త కథనంతో రూపొందుతున్న ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు. విశాఖపట్నం అంటే తనకు ఎంతో ఇష్టమని, అందమైన ఈ నగరంలో ఇల్లు కొనుగోలు చేసి, పదవీ విరమణ అనంతరం ఇక్కడే స్థిరపడాలనేది తన కల అని థమన్ ఆసక్తికరంగా వెల్లడించారు.

తెలుగులో ప్రత్యేకమైన చిత్రం...కథానాయిక అనస్వర రాజన్ మాట్లాడుతూ, మలయాళ చిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపు పొందిన అనంతరం తెలుగులో తన కెరీర్‌కు 'ఇట్లు అర్జున' ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సినిమా సహజత్వానికి ప్రాధాన్యమిస్తూ రూపొందుతోందని పేర్కొన్నారు.

# రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

**-అల్లిపురంలో దుకాణం సీజ్.. రూ.25 వేల జరిమానా**



విశాఖపట్నం, చైతన్యవారది: నగరంలో రోడ్లు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. అల్లిపురం ప్రధాన రహదారితో పాటు 32, 33, 34 వార్డుల్లో పారిశుద్ధ్య పనులను దక్షిణ మండల జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడుతో కలిసి పరిశీలించారు. అల్లిపురంలోని సాయి రత్న ట్రేడర్స్ దుకాణం వద్ద బహిరంగంగా వ్యర్థాలు వేస్తున్నట్లు గుర్తించి, దుకాణాన్ని సీజ్ చేయించారు. రూ.25 వేల జరిమానా చెల్లించిన అనంతరం మాత్రమే తిరిగి తెరవాలని ఆదేశించారు. దుకాణాలు, వ్యాపార సంస్థలు తమ వ్యర్థాలను తప్పనిసరిగా క్లాప్ వాహనాలకు అందజేయాలని సూచించారు. నివాస, వాణిజ్య ప్రాంతాల్లో చెత్త సేకరణకు వాహనాల పర్యటనలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, పారిశుద్ధ్య నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

**-నూతన డీఎస్పీకి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచన**

నిమ్మాడ: శ్రీకాకుళం సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్. ధనుంజయ నాయుడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా నూతన డీఎస్పీకి మంత్రి అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాకుళం సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రజలకు భద్రతపై నమ్మకం కలిగించేలా పోలీసు వ్యవస్థ పనిచేయాలని, చట్టాన్ని సమర్థంగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి సూచించారు.



# గిన్నిస్ రికార్డు సాధించిన లలితారాణికి మంత్రి అచ్చెన్నాయుడు సన్మానం

**-క్రోషేతో 12.18 కిలోమీటర్ల జాతీయ జెండాల అల్లికతో అరుదైన ఘనత**

నిమ్మాడ: గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించి శ్రీకాకుళం జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చిన చల్లా లలితారాణిని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బృంద సభ్యుల సమష్టి కృషితో క్రోషే (ఊలుతో అల్లిక) పద్ధతిలో 12.18 కిలోమీటర్ల పొడవైన భారత జాతీయ జెండాలను రూపొందించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం విశేషమని మంత్రి పేర్కొన్నారు. ఈ అరుదైన ఘనతతో శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన లలితారాణిని అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో లలితారాణి భర్త, ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, ఏపీఎన్జీవో సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ చౌదరి పురుషోత్తమనాయుడు, జిల్లా నాయకులు బస్వా భాస్కర్‌ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు బొత్స శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి బారకల నవీన్, తామరపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

**-పోలీస్ స్టేషన్లలో మూడో విడత తనిఖీలు ప్రారంభించిన సీపీ శంఖబ్రత బాగ్చి**

విశాఖపట్నం: నగరంలో శాంతిభద్రతలను అదుపులో ఉంచుతూ, ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో మూడో విడత తనిఖీలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్, శుక్రవారం నుంచి ప్రారంభించారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం మల్కాపురం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను సీపీ సమీక్షించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, పలు అంశాలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన సదుపాయాల గురించి నేరుగా అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, అవి సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాన్ని సమీక్షించారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



# క్షయ వ్యాధి రహిత భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి





**-'టీబీ ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా 'ఆరోగ్య సేవల కోసం ఉమ్మడి బృందాల' కార్యక్రమం ప్రారంభం -విశాఖలో కార్యక్రమాన్ని వీక్షించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు**

విశాఖపట్నం: దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'క్షయ వ్యాధి రహిత భారత్ అభియాన్'లో భాగంగా ప్రారంభించిన 'ఆరోగ్య సేవల కోసం ఉమ్మడి బృందాలు' కార్యక్రమంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా ఉదయం 11 గంటలకు దృశ్యమాధ్యమం ద్వారా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవాన్ని విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం శ్రీ కోదండ రామయ్య సదస్సుల మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అధికారులు వీక్షించారు.

ప్రతి మండలంలో ప్రత్యేక బృందం....ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు మాట్లాడుతూ, ప్రతి మండల పరిధిలో ఒక ఆరోగ్య సేవల ఉమ్మడి బృందాన్ని ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ బృందంలో ఐదుగురు 'మై భారత్' స్వచ్ఛంద సేవకులు, ఐదుగురు జాతీయ విద్యార్థి దళం శిక్షణార్థులు, ఒక అధికారి సభ్యులుగా ఉంటారని వివరించారు. ఈ బృందాలు స్థానిక వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు. క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్య సాధనలో యువత చురుకుగా భాగస్వాములు కావాలని కోరారు.

క్షయ వ్యాధి లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకోవాలి...ప్రభుత్వ ఛాతీ వ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. సునీల్ కుమార్ మాట్లాడుతూ, క్షయ వ్యాధి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజల్లో వ్యాధిపై అవగాహన పెంపొందించడంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. అనంతరం క్షయ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన గోడపత్రాలు, కరపత్రాలను అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ విద్యార్థి దళం శిక్షణార్థులు, 'మై భారత్' స్వచ్ఛంద సేవకులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ జి.ఏ.వి. రామేశ్వర్ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ వైద్యాధికారి డాక్టర్ జి.ఏ.వి. రామేశ్వర్, ఇన్‌చార్జి జిల్లా క్షయ వ్యాధి అధికారి డాక్టర్ పద్మజ, ఆచార్యుడు డాక్టర్ శ్రీధర్, సహ ఆచార్యుడు డాక్టర్ జె.వి. ప్రవీణ్ కుమార్, జాతీయ సేవా పథకం కార్యక్రమ సమన్వయకర్త సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# అందరూ తీర్పులిచ్చేవారే!



రక్షాబంధన్ వాణిజ్య ప్రకటనలో కథానాయిక కృతిసనన్ ధరించిన దుస్తులపై సోషల్‌మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. సంప్రదాయ వేడుకలో అలాంటి దుస్తులు ధరించడమేంటని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాజాగా ఈ వివాదంపై కృతిసనన్ మరోమారు స్పందించింది. కరీనా కపూర్ నిర్వహిస్తున్న 'వాట్ విమెన్ వాంట్' సీజన్ 6లో పాల్గొన్న ఆమె ఈ వివాదంపై మాట్లాడింది. 'నేను ధరించిన డ్రెస్ ఇంత వివాదం సృష్టిస్తుందని అనుకోలేదు. ఏకంగా ఆరుగురు కూర్చుని చేసే ప్రైమ్‌టైమ్ న్యూస్ ప్యానెల్ డిబేట్‌గా మారింది. ఇతరుల్ని జడ్జ్ చేస్తూ తీర్పులు ఇవ్వడం చాలా సులభం. ఇక్కడ అందరూ తీర్పులిచ్చేవారే. ఎవరి పని వారు చేసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు' అంటూ కృతిసనన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. రక్షాబంధన్ ప్రకటనలో కృతిసనన్ ఇండో-వెస్ట్రన్ దుస్తుల్లో కనిపించింది. తన సోదరుడితో పాటు శునకానికి రాఖీ కట్టినట్లుగా ఆ ప్రకటనలో చూపించారు. ఈ వివాదం నేపథ్యంలో చివరకు మేకర్స్ ఆ యాడ్‌ను తొలగించారు.

# కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి?



మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం 'కాకా' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. బాబీ కొల్లి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలకానుంది. ఈ నేపథ్యంలో చిరంజీవి తదుపరి సినిమా గురించి ఆసక్తికరమైన వార్తలు వెలువడుతున్నాయి. ఇప్పటికే పలువురు దర్శకుల పేర్లు వినిపిస్తుండగా, తాజాగా ఈ లిస్ట్‌లో తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ చేరారు. ఇటీవలే చిరంజీవితో కార్తీక్ సుబ్బరాజ్ భేటీ అయి కథ వినిపించినట్లు సమాచారం. అయితే ఈ ప్రాజెక్ట్‌పై చిరంజీవి ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. పిజ్జా, జిగర్తాండ, పేట, మహాన్‌తో పాటు ఇటీవల విడుదలైన 'డోరతి' చిత్రంతో విమర్శకుల ప్రశంసలందుకున్నారు దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్. దీంతో చిరు-కార్తీక్‌సుబ్బరాజ్ కాంబినేషన్ సినిమా వార్తలపై ఆసక్తినెలకొంది. మరోవైపు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చిరంజీవి చేయాల్సిన సినిమాపై ఇంకా స్పష్టత రాలేదు. అలాగే దర్శకుడు బుచ్చిబాబు సానా కూడా మెగాస్టార్‌కి కథ చెప్పినట్లు వార్తలొస్తున్నాయి. ఇప్పుడీ జాబితాలో కార్తీక్ సుబ్బరాజ్ సినిమా చేరింది.

# పూనమ్ కౌర్ సంచలన పోస్టులు.. 'ఆదర్శ కుటుంబం'పై పరోక్షంగా కామెంట్?



నటి పూనమ్ కౌర్ మరోసారి తన సోషల్ మీడియా పోస్టులతో వార్తల్లో నిలిచారు. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె.. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటూ తరచూ క్రిప్టిక్ పోస్టులు చేస్తుంటారు. ఎవరినీ నేరుగా పేరుతో ప్రస్తావించకుండా పలు విషయాలపై స్పందించే పూనమ్ కౌర్.. తాజాగా చేసిన వరుస పోస్టులు ఇప్పుడు టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారాయి.తాజాగా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఓ దర్శకుడిని ఉద్దేశిస్తూ పూనమ్ కౌర్ తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. "ఏమాత్రం ఆదర్శం లేని, వంద శాతం ప్రచారం చేసుకునే ఈ దర్శకుడి నుంచి నటీనటులను, నిర్మాతలను దేవుడే కాపాడాలి. హనీ ట్రాప్, మూఢనమ్మకాల ట్రాపింగ్‌తోనే ఇతను తన జీవితాన్ని గడుపుతుంటాడు. ఈ వ్యక్తికి అసలు ఎలాంటి ఆదర్శం లేదు. కాబట్టి ఇతనికి దూరంగా ఉండండి. ఈ తాంత్రికుడు, నకిలీ గురువు నుంచి అమాయకులను ఆ దేవుడే కాపాడాలి" అంటూ ఆమె పోస్ట్ చేశారు. అంతటితో ఆగకుండా మరో పోస్టులో "ఏకే అనేది మరో నటుడి విషయంలో 'అజ్ఞాతవాసి' లాంటిది.. అంతే" అంటూ రాసుకొచ్చారు. అయితే ఈ పోస్టుల్లో పూనమ్ కౌర్ ఎక్కడా ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించలేదు. దీంతో ఆమె ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారనే దానిపై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. పూనమ్ కౌర్ చేసిన పోస్టుల్లో 'ఆదర్శం', 'ఏకే', 'గురు', 'అజ్ఞాతవాసి' వంటి పదాలు ఉండటంతో.. నెటిజన్లు వీటిని దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో లింక్ చేస్తున్నారు. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేష్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం: ఏకే 47' సినిమా విడుదల వాయిదా పడిన నేపథ్యంలోనే పూనమ్ ఈ పోస్టులు చేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పూనమ్ కౌర్ తన పోస్టుల్లో ఎక్కడా త్రివిక్రమ్ పేరు ప్రస్తావించలేదు. అందువల్ల ఈ వ్యాఖ్యలు నిజంగానే ఆయనను ఉద్దేశించేవేనా? లేక మరెవరినైనా టార్గెట్ చేశారా? అనేది మాత్రం స్పష్టంగా తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం: ఏకే 47' విడుదల ఇప్పటికే పలుమార్లు వాయిదా పడింది. ముందుగా అక్టోబర్ 2న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం భావించింది. ఆ తర్వాత అక్టోబర్ 9కి విడుదల తేదీని మార్చారు.అయితే పోస్ట్ ప్రొడక్షన్ పనులు, మరికొన్ని షూటింగ్ కార్యక్రమాలు పూర్తికాకపోవడంతో అక్టోబర్ 9న కూడా సినిమా విడుదల కావడం లేదని నిర్మాత నాగవంశీ వెల్లడించారు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఈ

# గ్లామర్‌కే పరిమితం కావాలనుకోవడం లేదు.. ఇకపై అలాంటి పాత్రలే చేస్తా



బాలీవుడ్‌లో తన గ్లామర్‌తో పాటు నటనతోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ దిశా పటాని ఇప్పుడు తన కెరీర్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎక్కువగా గ్లామర్‌కు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో కనిపించిన ఈ ముద్దుగుమ్మ.. ఇకపై వైవిధ్యమైన, బలమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించాలని కోరుకుంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, ఇప్పటివరకు నేర్చుకున్న విషయాలు, భవిష్యత్తులో ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటోందనే అంశాలపై దిశా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. దిశా పటాని తొలిసారిగా 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ' సినిమాతో ప్రేక్షకులకు పరిచయమైంది. భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది. ఆ సినిమా విడుదలై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంది. ఈ పదేళ్లలో నటిగా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని దిశా తెలిపింది. విభిన్నమైన అనుభవాలు తనను మరింత పరిణతి చెందిన నటిగా తీర్చిదిద్దాయని చెప్పింది. ఇప్పటివరకు తాను ఎక్కువగా గ్లామర్‌కు ప్రాధాన్యమున్న సినిమాల్లో నటించినప్పటికీ, ఇకపై తన కెరీర్‌లో కొత్త ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు వెల్లడించింది. సినిమా పరిశ్రమలో గ్లామర్‌తో గుర్తింపు తెచ్చుకోవడం ఒక ఎత్తయితే, నటిగా విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించడం మరో ఎత్తు. ఈ విషయాన్ని దిశా పటాని కూడా గుర్తించినట్లు ఆమె వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. ఇకపై ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా, తనలోని నటనా ప్రతిభను బయటపెట్టే అవకాశాల కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పింది. కేవలం తెరపై అందంగా కనిపించడమే కాకుండా, కథలో కీలక పాత్ర పోషించే క్యారెక్టర్లు చేయాలని ఉందని దిశా తెలిపింది. ప్రేక్షకులు తన పాత్రతో భావోద్వేగపరంగా అనుసంధానమయ్యేలా ఉండాలని, కథను ముందుకు తీసుకెళ్లడంలో ఆ పాత్రకు ప్రాధాన్యం ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం దిశా పటాని 'హోలీగార్డ్స్ సాగా: ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్' అనే హాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నట్లు సమాచారం. భారతీయ సినిమాలతో పాటు అంతర్జాతీయ ప్రాజెక్టుల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్న ఆమెకు ఈ చిత్రం కెరీర్‌లో మరో కీలక అడుగు కానుంది.

CHAITANYA VAARADHI" Telugu Daily Printed, Published and owned by Bonda Gopinadha Rao, D.No. 3-9, Bharanikam village&post, Paravada Mandalam, Visakhapatnam-531 021. Published at D.No. 3-9, Bharanikam village&post, Paravada Mandalam, Visakhapatnam-531 021.and Printed at Chaitanya Vaaradhi Printers, D.No. 3-9, Bharanikam village&post, Paravada Mandalam, Visakhapatnam-531 021. Editor : Bonda Gopinadharao, D.No. 3-9, Bharanikam village&post, Paravada Mandalam, Visakhapatnam-531 021. Cell : 9848682422, RNI.NO.APTEL\2006\18521, Postal Regd.No. ANK/0017/2015/2017 E-mail: chaitanyavaradhi@gmail.com